# నేటి నిజం

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ ఆదివారం 19-2-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 150 పేజీలు:6 వెల: రూ.1/-


## మహాదేవుని దీవెనలతో అందరి జీవితాలు సుభిక్షంగా వర్ధిల్లాలి

### –దేశ ప్రజలకు తెలంగాణా సీఎం కేసీఆర్ శివరాత్రి శుభాకాంక్షలు

హైదరాబాద్ ఫిబ్రవరి 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర, దేశ ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. శివరాత్రి రోజున భక్తిశ్రద్ధలతో శివనామం జపిస్తూ చేపట్టే ఉపవాస దీక్షలు, రాత్రి జాగరణ, పూజలు అభిషేకాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతీ ఒక్కరిలో ఆత్మశుద్ధిని, పరివర్తనను కలిగిస్తాయని సీఎం అన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో శివరాత్రి పండుగను జరుపుకోవాలని కోరారు. మహాశివుని కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని సీఎం ప్రార్థించారు. లయకారునిగా, అర్ధనారీశ్వరునిగా, హిందువులు కొలిచే ఆ మహాదేవుని దీవెనలతో అందరి జీవితాలు సుభిక్షంగా వర్ధిల్లాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. మరోవైపు మహాశిరాత్రిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రం లోని అనేక దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శైవక్షేత్రాలకు పోటెత్తారు. ఆ దేవదేవునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. వేములవాడ రాజన్న ఆలయం వేయిస్తంభాల గుడి రామప్ప ఆలయం ఏడుపాయల వనదుర్గామాత () తదితర ఆలయాలు భక్తజనసంద్రంగా మారాయి. శంభో శంకరా అంటూ భక్తిశ్రద్ధలతో మహాదేవుడిని భక్తులు దర్శించుకుంటున్నారు.

## రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పించిన దేవాదాయ మంత్రి ఇంద్రకరణ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 18: (నేటినిజం ప్రతినిధి): మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామికి శనివారం రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ సామాన్య భక్తులకు వేములవాడ దివ్యమైన క్షేత్రం అన్నారు. మంత్రి కే తారక రామారావు, ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేమి రమేష్ బాబుల సహకారంతో శైవ క్షేత్రం వేములవాడలో అన్ని సౌకర్యాలు మెరుగు పరచడానికి కృషి చేస్తున్నారన్నారు. 50 కోట్ల నిధులతో భక్తుల సౌకర్యార్థం వేములవాడ లో ఆధ్యాత్మిక ఉట్టిపడేలా మర్నిని అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని తెలిపారు. సిఎం కేసిఆర్ మార్గదర్శనం మేరకు కాళేశ్వరం ప్రాజెక్ట్ తో గోదావరి జలాలలో ఆలయం ధర్మ గుండం నింపామన్నారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, స్వామి వారి దర్శనం సజావుగా జరిగేందుకు భక్తులు ఉద్యోగులకు, పోలీస్ లకు సహకరించాలన్నారు. ఆయన వెంటజిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ– రాఘవ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్, ఆర్డీఓ టి శ్రీనివాస్ రావులు ఉన్నారు.

## ఏప్రిల్ 30న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు..

హైదరాబాద్, ఫిబ్రవరి 18:సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 30వ తేదీన సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలను నిర్వహించనున్నారు. కంటోన్మెంట్ పరిధిలో 8 వార్డులు ఉన్నాయి. సికింద్రాబాద్ సహా మొత్తం 57 కంటోన్మెంట్ బోర్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాపై బోర్డు అధికార యంత్రాంగం కసరత్తు ఇప్పటికే ప్రారంభించినట్లు తెలుస్తున్నది. 2015లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరిగాయి. ఆ ఏడాది ఫిబ్రవరి 10న పాలకవర్గం కొలువుదీరింది. 2020 ఫిబ్రవరి 10 నాటికి పాలకవర్గం గడువు తీరింది. అనంతరం కేంద్రం నామినేటెడ్ సభ్యుడిని నియమించింది. అయితే, బోర్డుకు ఎన్నికలు నిర్వహించాలని పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. దీనిపై స్పందించాలని న్యాయస్థానాలు కూడా కంటోన్మెంట్ బోర్డును ఆదేశిస్తూ వస్తుంది. ఈ క్రమంలోనే కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ బోర్డు పరిధిలోని సివిల్ ఏరియాను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసేందుకు గానూ విధి విధానాలపై కొన్నిరోజుల కిందట కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విలీన ప్రక్రియ ఊపందుకుంటుందనుకున్న తరుణంలో తాజాగా బోర్డు ఎన్నికల అంశం తెరపైకి రావడం గమనార్హం.

## అలంపూర్ ఆలయాన్ని అద్భుతమైన పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్సీ కవిత



జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 18: అలంపూర్‌లోని బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాన్ని అద్భుతమైన పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతాం అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. జోగులాంబ ఆలయ అభివృద్ధికై సీఎం కేసీఆర్ కట్టుబడి ఉన్నారని ఆమె స్పష్టం చేశారు. ఈ ఆలయానికి ఇతర రాష్ట్రాల నుండి రవాణా సౌకర్యాలు మెరుగుపరుస్తామని కవిత పేర్కొన్నారు.

మహాశివరాత్రి సందర్భంగా అలంపూర్‌లోని బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం, జోగులాంబ అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. తెలంగాణలో అన్నిరకాలుగా శాంతి యుత వాతావరణం ఉంటే, దేశంలో మాత్రం విపరీత ధోరణితో ఉన్న నాయకత్వం ఉందని, విపరీత ధోరణులను పక్కనపెట్టి, సహృదయంతో ఆలోచించే నాయకత్వం రావాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేశామని కవిత తెలిపారు.

తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తమకూ అమలు చేయాలని ఇతర రాష్ట్రాల్లో ప్రజలు డిమాండ్ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. కృష్ణా, తుంగభద్ర నదులు ఉన్నా గతంలో అలంపూర్ ప్రాంతానికి నీరు వచ్చేది కాదని, కానీ ప్రస్తుతం మిషన్ భగీరథ పథకం ద్వారా మారుమూల గ్రామాల్లో సైతం నీటి సదుపాయం కల్పించామన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఆర్డీఎస్ ప్రాజెక్టు పాదయాత్ర ద్వారా అలంపూర్ ప్రాంతాన్నంతా కదిలించి ఉద్యమంలో నడిపించారని గుర్తు చేశారు. రైతు పక్షపాతి అయిన సీఎం కేసీఆర్ నాయకత్వంలో తుమ్మిళ్ల లిఫ్ట్, ఆలంపూర్ లిఫ్ట్‌లను బాగు చేసుకున్నామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఒకప్పుడు పాలమూరు ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారని, కానీ ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుండి కూలీలు పాలమూరుకు వచ్చి పనిచేస్తున్నారని కవిత గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అబ్రహం, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, గద్వాల జడ్పీ ఛైర్ పర్సన్ సరిత తిరుపతయ్య, కార్పొరేషన్ ఛైర్మన్లు మేడె రాజీవ్ సాగర్, సాయిచంద్ పాల్గొన్నారు.

## బల్గేరియాలో విషాదం.. ట్రక్కులో 18 మంది వలసదారుల మృతదేహాలు లభ్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: బల్గేరియాలో విషాదం చోటు చేసుకున్నది. బల్గేరియాలో ఓ ట్రక్కులో 18 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో 22 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని దవాఖానలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. మరణించిన వారిలో ఒక చిన్నారి కూడా ఉన్నది. వీరంతా బల్గేరియాలోకి అక్రమంగా ప్రవేశిస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. ట్రక్కు దొరికిన ప్రదేశం బల్గేరియా రాజధాని సోఫియాకు సమీపంలోనే ఉండటం విశేషం. 2019 లో ఇలాగే బ్రిటన్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన 39 మంది దుర్మరణం పాలయ్యారు.

లోకోర్స్కో వద్ద నిలిపి ఉంచిన ఓ ట్రక్కు నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన స్థానిక గ్రామస్థులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని చూడగా.. ట్రక్కు చుట్టుపక్కల అనేక మృతదేహాలు కనిపించాయి. ఓ దేశం నుంచి 52 మందితో ట్రక్కు బల్గేరియాకు బయల్దేరింది. చాలా రోజులుగా ఆహారంకానీ, తాగునీరుకానీ లేకపోవడంతోపాటు ట్రక్కులో కిక్కిరిసిపోయి ఉండి ఊపిరాడక 18 మంది వలసదారులు చనిపోయారు. మరో 22 మంది తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వీరికి చికిత్స అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ట్రక్కు ఎక్కడి నుంచి వస్తున్నది అధికారులు తెలుసుకునే పనిలో పడ్డారు.

ట్రక్కులో 52 మంది వలసదారులు ఉన్నట్లు బల్గేరియా అధికారుల విచారణలో తేలింది. వీరిని ఎక్కడి నుంచి ఎవరు బల్గేరియాకు తీసుకొస్తున్నారు అనేది తెలియరాలేదు. ట్రక్కులో చిన్న చిన్న కంపార్ట్‌మెంట్‌లు చేసి, జనాలను అందులో తోశారు. చాలా మంది ఊపిరాడక, ఆకలితో చనిపోయారనిబల్గేరియా ఆరోగ్య మంత్రి తెలిపారు. వీరంతా ఆఫ్ఘనిస్తాన్‌కు చెందినవారుగా అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ట్రక్కు టర్కీ మీదుగా ప్రయాణించి బల్గేరియా చేరుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు డిప్యూటీ ప్రాసిక్యూటర్ జనరల్ బోరిస్లోవ్ తెలిపారు.

## ఏర్పాట్లు గణం... మురిసిన భక్తజనం





రాష్ట్ర మంత్రి కే తారకరామారావు మార్గదర్శనంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చెన్నమనేని రమేష్ బాబు సూచనలతో జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి నేతృత్వంలో జిల్లా యంత్రాంగం జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం భక్తులు మెచ్చేలా ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సామాన్య భక్తుల కేంద్రంగా ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం జాతరలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను చూసి రాజన్న భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### రాజన్న జల ప్రసాదం

లక్షలాది జాతరకు వచ్చిన భక్తులకు రాజన్న జల ప్రసాదం పేరుతో ఉచిత మినరల్ వాటర్ సౌకర్యం కల్పించారు. భక్తులకు ఉచిత రక్షిత నీటిని అందించేందుకు ప్రత్యేక రాజన్న జల ప్రసాదం కేంద్రాలు ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

### పర్మనెంట్ టాయిలెట్‌లు

గతంలో ఏర్పాటు చేసే తాత్కాలిక టాయిలెట్ ల స్థానంలో ఈ సారి పర్మనెంట్ టాయిలెట్ లను ఏర్పాటు చేశారు. జాతరలో పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పురుషులకు, స్త్రీలకు వేరు వేరు గా శాశ్వత టాయిలెట్ లను ఏర్పాటు చేశారు. టాయిలెట్ ల క్లీనింగ్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు.

### మై ఐ హెల్ప్ యు కేంద్రాలు

జాతరలో భక్తులకు సౌకర్యాలు సందేహాలను నివృత్తి చేయడంతో వారికి కావాల్సిన సమాచారాన్ని అందించేందుకు , గైడ్ చేసేందుకు మై హెల్ప్ యు కేంద్రాలను జనసమ్మర్ధక ప్రదేశాలు కూడలి లలో ఏర్పాటు చేశారు . గతం కంటే ఎక్కువగా ఏర్పాటు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో ఈ కేంద్రాలను సందర్శించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

### బేబీ ఫీడింగ్ సెంటర్

చిన్నారులకు పాలిచ్చే సౌకర్యార్థం ప్రత్యేకంగా బేబీ ఫీడింగ్ సెంటర్ లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఈ కేంద్రాల గురించి సులభంగా తెలిసేలా పెద్ద అక్షరాలతో కేంద్రం పేరును రాయడమే కాకుండా నిరక్ష్య రాసులు కూడ గుర్తించేలా చంటి పిల్లలకు పాలిస్తున్న తల్లి చిత్రాన్ని కేంద్రం పై పెద్ద చిత్రీకరించారు.

### గత ఈతగాళ్ల తో నిరంతర గస్తీ

జాతర కు వచ్చే భక్తుల కు ప్రమాదాల కు దూరంగా ఉండేలా హెచ్చరించడంతోపాటు నీటి ప్రమాదాలకు గురైనప్పుడు కాపాడేందుకు వీలుగారెండు షిఫ్టుల్లో 24 మంది గత గాళ్లను గుడి చెరువు ధర్మగుండంలలో అందుబాటులో ఉంచారు.

### ప్రతి అంగుళం.... నిఘా నేత్రం తో పరిశీలన

మహాశివరాత్రి జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. జాతర మొత్తం కవర్ అయ్యేలా వందలాది సీసీటీవీలను ఏర్పాటు చేసి జాతర పూర్తయ్యే వరకు నిఘా నేత్రాల ద్వారా పరిశీలిస్తున్నారు. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయిన, భక్తులకు ఇబ్బంది కలిగిన వెంటనే క్షేత్ర సిబ్బంది తో మాట్లాడి నిఘా నేత్రాల ద్వారా పరిశీలిస్తూ అపసవ్యతలను చక్కదిద్దుతున్నారు.

### షవర్ బాత్ లతో సులభంగా పుణ్య స్నానాలు

రాజన్న దర్శనం ముందు భక్తులు పుణ్యస్నానం ఆచరించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ జాతరలో భక్తులు సులభంగా పుణ్య స్థానాలు ఆచరించేందుకు వీలుగా గుడి చెరువు ప్రాంతంలో షవర్ బాతులను అధికారులు ఏర్పాటు చేశారు.

### ఎక్కడ చూసినా... సూచిక బోర్డులే

ఎవరిని సంప్రదించకుండానే భక్తులను నిర్దేశిత గమ్యస్థానాలకు చేర్చడంలో సూచిక బోర్డులదే ప్రధాన పాత్ర. సూచిక బోర్డుల ప్రాధాన్యతను గుర్తించిన జిల్లా యంత్రాంగం ఈసారి పెద్ద ఎత్తున జన సమ్మర్ధక ప్రదేశాలు, ప్రధాన కూడళ్లలో సూచిక బోర్డులను పెద్ద పెద్ద అక్షరాలతో ఇంగ్లీష్ ,తెలుగు భాషల్లో ఏర్పాటు చేసింది. దీంతో భక్తులు ఈ సూచిక బోర్డుల ఆధారంగా దర్శనం చేసుకోవడంతో పాటు తిరిగి వారి గమ్య స్థానాలకు సులభంగా చేరుకుంటున్నారు.

### ఈ సారి గగన వీక్షణం

హెలికాప్టర్ ద్వారా గగన వీక్షణం చేయాలన్నది ప్రతి ఒక్క భక్తుని కల. ఖర్చుతో కూడుకున్న పనైనప్పటికీ రాజన్నను దర్శించుకున్న భక్తి భావనతో పాటు కొంతమంది భక్తులు హెలికాప్టర్ ద్వారా గగనవీక్షణం చేస్తూ రాజన్న జాతరలో ప్రత్యేక మధుర అనుభూతిగా మలుచుకుంటున్నారు.

### వైరల్ గా మారిన సమాచార శాఖ జాతర డ్రోన్ దృశ్యాలు

సుప్రసిద్ధ శైవ క్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన వేముల వాడలో జరిగే మహాశివరాత్రి జాతర దృశ్యాలను మరింత అందంగా ప్రజలకు చూపేందుకు విలువ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా జాతర దృశ్యాలను చిత్రీకరించారు.

వాటిని మీడియా గ్రూప్ లలో పోస్ట్ చేయగా క్షణాల వ్యవధిలోనే సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి .అనేకమంది నెటిజన్లు తమ సామాజిక మధ్య మా ఖాతాల్లో వీటిని పోస్ట్ చేశారు మరోవైపు మీడియా ప్రతినిధులు తమ చానల్లో వీటిని ప్రసారాలు చేశారు. జాతరను స్వయంగా వీక్షించలేని భక్తులు ఈ దృశ్యాలను చూస్తూ తన్మయత్వం పొందుతున్నారు.

### సమస్త సమాచారం ఆప్ రూపంలో..

వేములవాడ శివరాత్రి జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సౌకర్యాలు ,అట్లాగే సుప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయం స్థల పురాణం, చరిత్ర మొదలైన వివరాలతో కూడిన సమస్త సమాచారాన్ని ప్రత్యేకంగా రూపొందించిన రూపంలో జిల్లా యంత్రాంగం అందుబాటులో తెచ్చింది.

APP లో పొందుపరిచిన సమాచారం ఉపయోగకరంగా ఉండడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ అప్లికేషన్ ను గూగుల్ ప్లే స్టోర్ నుండి తమ స్మార్ట్ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకునీ.. సమాచారం ను తెలుసుకున్నారు.

### భక్తి పారవశ్యం... శివార్చనం

గుడి చెరువు లో ఏర్పాటు చేస్తున్న శివార్చన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ఈ కార్యక్రమంలో వందలాది కళాకారులు ప్రదర్శిం చిన ఒగ్గుడోలు, శాస్త్రీయ సంగీత నృత్య ప్రదర్శనలు,జానపద కళాప్రదర్శనలు, కోలాటాలు, ఒగ్గుడోలు ప్రదర్శనలు భక్తులందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

### ప్రథమ చికిత్స కేంద్రాలు

జాతరకు వచ్చే భక్తులకు ఆరోగ్యపరంగా ఎట్లాంటి అసౌకర్యం కలిగిన వెంటనే స్పందించి చికిత్స అందించేందుకు వీలుగా ప్రథమ చికిత్స కేంద్రాలను ముఖ్య ప్రదేశాల్లో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది.

వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ వైద్య సేవలను అందిస్తున్నారు.

### ప్రత్యేక అలంకరణ ఉచిత బస్సులు

జాతరకు వేములవాడ వచ్చే భక్తులను తిప్పాపూర్ బస్టాండ్ నుంచి దేవాలయం వద్దకు చేర్చేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా ప్రత్యేకంగా అలంకరించిన బస్సులను అందుబాటులోకి ఉంచింది.వీటిలో భక్తులకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంది.

### అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట భద్రత

మహాశివరాత్రి జాతర లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీస్ శాఖ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు.వందలాది మంది రక్షకభటులు భద్రత చర్యల్లో నిమగ్నమయ్యారు. భక్తులకు సులభంగా, వేగంగా దర్శనమయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

### రాజన్న భక్తులకు హెలిక్యాప్టర్ సేవలు
### -ప్రారంభించిన ఎమ్మెల్యే రమేష్ బాబు

వేములవాడలో మహాశివరాత్రి సందర్భంగా విచ్చేసిన రాజన్న భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెలికాప్టర్ సేవలను శనివారం వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు హెలికాప్టర్ ద్వారా జాతర ను గగన వీక్షణ చేశారు.ఎమ్మెల్యే సతీమణి మరియా, జెడ్.పి చైర్మన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి–రాజు , సెస్ చైర్మన్ చిక్కాల రామారావు , అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్ , ఆర్.డి.ఓ శ్రీనివాసరావు లు పాల్గొన్నారు.

## కాళేశ్వరం శివయ్య నుంచి బోరంచ పోచమ్మ పాదాలదాకా గోదారి: మంత్రి హరీశ్‌రావు



సంగారెడ్డి, నవంబర్ 18: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఆర్థిక, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఇవాళ సంగారెడ్డి జిల్లా మనూరు మండలం బోరంచలో బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు భూమి పూజ చేశారు. నారాయణ ఖేడ్, ఆందోల్ నియోజకవర్గాల్లోని లక్షా 65 వేల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో రూ.1,774 కోట్ల నిధులతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. కాళేశ్వర శివుని దగ్గర మొదలై గోదారి నీళ్లు బోరంచ పోచమ్మ తల్లి పాదాల వరకు రాబోతున్నాయని అన్నారు.

బంగారు ముక్కు పుడకను బోరంచ అమ్మవారికి మొక్కుగా సమర్పిస్తామని మంత్రి చెప్పారు. నారాయణ ఖేడ్ దశ దిశ మారిందని, నియోజకవర్గానికి కాలువల ద్వారా సాగునీటి ఇవ్వబోతున్నామని తెలిపారు.

గత పాలకులు ఖేడ్ సమస్యలు తీర్చలేకపోయారని, సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాతనే ఖేడ్ తలరాత మారిందని అన్నారు. పేదల కలలను నిజం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. గత పాలకులు ఉమ్మడి జిల్లాలో మంజీరా నది ఉన్నప్పటికీ.. సాగునీరు కాదుకదా కనీసం తాగునీరు కుడా ఇవ్వలేదని విమర్శించారు.

అంతేగాక, గత పాలకులు ఇక్కడ గంజాయి పండించి డబ్బులు సంపాదించు కున్నారని మంత్రి హరీష్‌రావు విమర్శించారు. నారాయణఖేడ్ గతంలో వలసలకు కేంద్రంగా ఉండేదని, ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి పనుల కోసం నారాయణ ఖేడ్‌కు వలస వస్తున్నారని చెప్పారు. ఖేడ్ లో లక్షా 80 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే ప్రాజెక్టులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారన్నారు. కేవలం సీఎం కేసీఆర్ వల్లనే నారాయణ ఖేడ్ అభివృద్ధి చెందిందని, బసవేశ్వరుడిని ప్రేమించి, పూజించిన వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. దేవుడిని అడ్డం పెట్టుకొని కొన్ని పార్టీలు రాజకీయాలు చేస్తున్నా యని ఆరోపించారు.

సీఎం కేసీఆర్ యాదాద్రి ఆలయాన్ని భూలోక వైకుంఠంగా మార్చారని మంత్రి చెప్పారు. బోరంచ గ్రామంలో దళిత బంధు ఇస్తామని, 166 గ్రామాల్లోని 231 చెరువులను నింపుతూ సాగు నీటిని అందిస్తామని, బసవేశ్వర ప్రాజెక్టుతో గోదావరి జలాలను 471 మీటర్ల ఎత్తుకు తెచ్చి నారాయణ ఖేడ్ ప్రాంతాన్ని సస్యశ్యామలంచేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, క్రాంతికిరణ్, జడ్పీ చైర్మన్ మంజుశ్రీ రెడ్డి, కలెక్టర్ శరత్ పాల్గొన్నారు.

## పాలమూరును పూర్తిచేసి తీరుతాం : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 18: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు ఎన్ని అవాంతరాలు వచ్చినా పూర్తి చేసి తీరుతామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా వీరన్నపేట పెద్ద శివాలయంలో ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

పాలమూరు ప్రాజెక్టుకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఆయన స్పందించారు. ప్రాజెక్టు పూర్తయితేనే ఈ ప్రాంతానికి న్యాయం జరుగుతుందని, పేదరికం, కష్టాలు శాశ్వతంగా దూరమవుతాయని పేర్కొన్నారు . రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టులను పూర్తిచేసిన ప్రభుత్వం కచ్చితంగా పాలమూరు ప్రాజెక్టును కూడా పూర్తి చేసి అన్నదాతకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.ప్రాజెక్టు నిర్మాణం ఉమ్మడి జిల్లా ప్రజల న్యాయమైన కోరిక అని తెలిపారు. కరువు ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రాజెక్టు అత్యవసరమని పేర్కొన్నారు. సాగునీటి లభ్యత పెరిగితే జిల్లా స్వరూపమే మారుతుం దని, ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం వల్ల లక్షల ఎకరాల్లో పంటలు పండుతున్నాయన్నారు. కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా ఎండాకాలంలో కూడా వాగుల్లో పుష్కలంగా నీళ్లు ప్రవహిస్తున్నాయన్నారు. చెరువుల పూడికతీత వల్ల సాగునీటి లభ్యత పెరిగిందన్నారు.

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ శుకపికముల – స్వరములుగా
నకలంక మైత్రి వశీత్రి సాత్మ్యముగా
రకరకముల భావములను
ప్రకటించిన "ఆలపాటి లక్ష్మి"ని దలతున్ !!

( ఫిబ్రవరి 19 నటి ఆలపాటి లక్ష్మి పుట్టిన రోజు..)

–రాధశ్రీ
సెల్:9494481210



# "వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్"కు క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం 2022–23 నుండి 2025–26 ఆర్థిక సంవత్సరాలకు గాను రూ.4800 కోట్ల ఆర్థిక కేటాయింపులతో కేంద్ర ప్రాయోజిత పథకం– "వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్'' (వివిపి)కి ఆమోదం తెలిపింది.

ఉత్తర సరిహద్దులోని గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం ద్వారా గుర్తించబడిన సరిహద్దు గ్రామాలలో నివసించే ప్రజల జీవన నాణ్యత మెరుగుపడుతుంది. సరిహద్దు ప్రాంతాల్లోని వారి స్థానిక స్థానాల్లో ఉండేలా ప్రజలను ప్రోత్సహించడంలో మరియు ఈ గ్రామాల నుండి వలసలను తిప్పికొట్టడం తోపాటు సరిహద్దు భద్రతను మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది.

దేశంలోని ఉత్తర భూ సరిహద్దు వెంబడి ఉన్న 19 జిల్లాలు మరియు 46 బోర్డర్ బ్లాక్‌లు మరియు 1 యూటీలో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు జీవనోపాధి అవకాశాల కల్పన కోసం ఈ పథకం నిధులను అందిస్తుంది. ఇది సమ్మిళిత వృద్ధిని సాధించడంలో మరియు సరిహద్దు ప్రాంతాలలో జనాభాను నిలుపుకోవడంలో సహాయపడుతుంది. మొదటి దశలో 663 గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు.

ఉత్తర సరిహద్దులోని సరిహద్దు గ్రామాల్లో స్థానిక సహజ మానవ మరియు ఇతర వనరుల ఆధారంగా ఆర్థిక చోదకులను గుర్తించి అభివృద్ధి చేయడం మరియు సామాజిక వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, నైపుణ్యం ద్వారా యువత మరియు మహిళల సాధికారత ద్వారా "హబ్ మరియు స్పోక్ మోడల్"లో వృద్ధి కేంద్రాలను అభివృద్ధి చేయడంలో ఈ పథకం సహాయపడుతుంది. అభివృద్ధి మరియు వ్యవస్థాపకత, కమ్యూనిటీ ఆధారిత సంస్థలు, సహకారాలు, ఎస్‌హెచ్‌జీలు, ఎన్‌జీఓలు మొదలైన వాటి ద్వారా "ఒక గ్రామం–ఒక ఉత్పత్తి" అనే భావనపై స్థానిక సాంస్కృతిక, సాంప్రదాయ జ్ఞానం మరియు వారసత్వం మరియు స్థిరమైన పర్యావరణ–వ్యవసాయ వ్యాపారాల ప్రచారం ద్వారా పర్యాటక సామర్థ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమ లక్ష్యం.

గ్రామ పంచాయతీల సహాయంతో జిల్లా పరిపాలన ద్వారా వైబ్రెంట్ విలేజ్ యాక్షన్ ప్లాన్‌లు రూపొందించబడతాయి. కేంద్ర మరియు రాష్ట్ర పథకాలు 100% సంతృప్తతను నిర్ధారించబడతాయి. రహదారుతో కనెక్టివిటీ, తాగునీరు, 24లీ7 విద్యుత్ – సౌర మరియు పవన శక్తిపై దృష్టి కేంద్రీకరించడం, మొబైల్ మరియు ఇంటర్నెట్ కనెక్టివిటీ, పర్యాటక కేంద్రాలు, బహుళ ప్రయోజన కేంద్రాలు మరియు ఆరోగ్య మరియు సంరక్షణ కేంద్రాలు ఈ పథకం ద్వారా దృష్టి కేంద్రీకరించిన అంశాలు.

బోర్డర్ ఏరియా డెవలప్‌మెంట్ ఓరోగ్రామ్‌తో అతివ్యాప్తి ఉండదు. రూ.4800 కోట్ల ఆర్థిక కేటాయింపుల్లో రోడ్ల కోసం రూ. 2500 కోట్ల రూపాయలను వినియోగిస్తారు.

# రూ.7 కోట్ల వజ్రాభరణాలతో పరారైన కారు డ్రైవర్..

హైదరాబాద్, ఫిబ్రవరి 18:హైదరాబాద్ లో ఓ కారు డ్రైవర్ ఆభరణాల వ్యాపారి వద్ద పనిచేస్తూ.. రూ.7 కోట్ల విలువైన వజ్రాభరణాలతో పరారయ్యాడు. ఈ ఘటన ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని మైహోం భుజ అపార్ట్‌మెంట్స్‌లో ఉండే రాధిక ఆభరణాల వ్యాపారం చేస్తుంటారు. అదే అపార్ట్‌మెంట్స్‌లో ఉండే అనూష రూ.50 లక్షల విలువ చేసే ఆభరణాలను ఆర్డర్ చేశారు. నిన్న సాయంత్రం మధురానగర్‌లో బంధువుల ఇంటికి వెళ్లిన అనూష నగలను అక్కడికే పంపమని చెప్పారు. దీంతో రాధిక తన కారులో డ్రైవర్ శ్రీనివాస్ (26), సేల్స్‌మెన్ అక్షయ్ (30)లతో ఆ నగలను పంపారు. మధురానగర్ చేరుకున్న తర్వాత డ్రైవర్ శ్రీనివాస్ కారులో ఉండగా, అక్షయ్ నగలను తీసుకెళ్లి అనూషకు ఇచ్చి తిరిగి వచ్చి చూస్తే కారు లేదు. సిరిగిరిరాజు జెమ్స్ అండ్ జువెల్లర్స్‌కు ఇవ్వాల్సిన రూ.7 కోట్ల విలువైన వజ్రాభరణాలు కారులోనే ఉన్నాయి. శ్రీనివాస్ ఆ నగలతో పరారైనట్టు అనుమానించిన అక్షయ్ వెంటనే విషయాన్ని రాధికకు తెలియజేశారు. ఆమె ఎస్సార్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

# క్రీడలలో డ్రోపింగ్ సమస్య పరిష్కారానికి ఒప్పందం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:క్రీడలలో డోపింగ్ మీద జరిపే నిరంతర పోరాటంలో భాగంగా భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, హైదరాబాద్ లోని జాతీయ ఔషధ విద్య, పరిశోధనా సంస్థ (నైపర్), భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ ఎస్ ఎస్ఎఐ) మధ్య త్రైపాక్షిక అవగాహనా ఒప్పందం మీద సంతకాలు జరిగాయి. ముందస్తుగా పోషకాహారాన్ని పరీక్షించే సౌకర్యం కల్పించి క్రీడాకారులకు తగిన సమాచారం అందించటం, అందులో ఇమిడి ఉన్న రిస్క్ గురించి అప్రమత్తం చేయటం ఈ ఒప్పందం లక్ష్యం. ఈ కోణంలో పరిశోధనలు మరింత పెంచటం, పరిశుభ్రమైన యాంటీ డోపింగ్ ఆహార పదార్థాలను క్రీడాకారులకు సిఫార్సు చేయటం దిశగా ఈ ఒప్పందం కృషి చేస్తుంది.

క్రీడాకారులకు ప్రత్యేక పోషకాహారాలు సిఫార్సు చేయటం మీద ఈ అవగాహనా ఒప్పందం దృష్టి సారిస్తుంది. హైదరాబాద్ లోని నైపర్ లో ఉన్న టెస్టింగ్ లేబరేటరీ రూపొందించే విధానం సాయంతో ఆహారం ఏ మేరకు అనుకూలమైనదో గుర్తించే వీలు కలుగుతుంది. ఇది దేశంలోని క్రీడాకారులతో బాటు ప్రజలందరికీ ఎంతగానో ఉపయోగపడుతుంది. అదే సమయంలో ఫుడ్ సప్లిమెంట్స్ నాణ్యతను గుర్తించటానికి, తద్వారా భారతదేశంలో వాటి మార్కెటింగ్ కు వెనులుబాటు కలిగిస్తుంది. దీర్ఘకాలంలో క్రీడాకారుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే పదార్థాలు ఏవైనా వారి ఫుడ్ సప్లిమెంట్స్ లో ఉంటే ఆ విషయంలో కూడా క్రీడాకారులకు అవగాహన పెరుగుతుంది.

దేశంలో ఆరోగ్యకరమైన క్రీడల వాతావరణాన్ని కల్పించే దిశలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందని ఈ సందర్భంగా యువజన వ్యవహారాలు, క్రీడాలమంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీమతి సుజాతా చతుర్వేది చెప్పారు. తమ ఆహార పదార్థాల విషయంలో మన క్రీడాకారులు తగిన నిర్ణయం తీసుకోవటానికి దోహదపడేలా ఈ అవగాహనా ఒప్పందం తోడ్పడుతుందన్నారు.

క్రీడాకారుల ఫుడ్ ఆహార సప్లిమెంట్స్ ను పరీక్షించే దిశలో ఒక మైలురాయిని చేరుకోవటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, భారత ప్రభుత్వ ఔషధాల విభాగం కార్యదర్శి శ్రీమతి అపర్ణ అందరినీ అభినందించారు.

న్యూ ఢిల్లీలోని శాస్త్రీ భవన్ లో ఔషధాల విభాగం కార్యాలయంలో ఆ విభాగం కార్యదర్శి శ్రీమతి అపర్ణ, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి సుజాతా చతుర్వేది, భారత ప్రభుత్వ ఔషధాల విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీ రజనీష్ తింగల్, క్రీడల విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీ కునాల్, నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్, సీ ఈ వో శ్రీమతి రీతూ సేన్ సమక్షంలో ఈ అవగాహనా ఒప్పందం మీద సంతకాలు జరిగాయి.

ప్రస్తుత తరుణంలో తగిన అవగాహన లేని కారణంగా జరిగే పొరపాట్ల వలన డోపింగ్ బారిన పడుతున్నారు. మార్కెట్లో దొరికే రకరకాల పోషకాహార సప్లిమెంట్స్ లో ఉన్న రిస్క్ ను తెలుసుకోలేకపోవటానికి కారణం అందుకు సంబంధించిన సరైన సంఆచారం అందుబాటులో లేకపోవటమే. దీనివలన యాంటీ డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించినవారుగా తమ కెరీర్ ను నాశనం చేసుకుంటున్నారు. ఈ అవగాహనా ఒప్పందం వలన క్రీడాకారులు అలయంటూ పొరపాట్లు చేసే ప్రమాదం ఉండదు. ఆ విధంగా దేశంలో సురక్షితమైన క్రీడా వాతావరణం ఏర్పడుతుంది.

భారత ప్రభుత్వపు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, భారత జాతీయ యాంటీ డోపింగ్ ఏజెన్సీ దేశ క్రీడాకారుల ప్రయోజనాలను, పొరపాటున డోపింగ్ బారిన పడే ప్రమాదాన్నుంచి కాపాడే విషయంలో అంకిత భావంతో కృషి చేస్తున్నాయనటానికి ఈ త్రైపాక్షిక ఒప్పందమే నిదర్శనం. న్యూట్రీషనల్ సప్లిమెంట్స్ మీద అవగాహన పెంచేందుకు సోషల్ మీడియాలో కూడా దృశ్య, శ్రావణ మాధ్యమాలతో ప్రచారం చేస్తున్నారు.

# జేఎన్టీయూలో ఎమ్మెల్సీ కౌంటింగ్ సెంటర్.. ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



అనంతపురము,ఫిబ్రవరి 18: కడప– అనంతపురం– కర్నూలు జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ మరియు అనంతపురం స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం ఉదయం స్థానిక జేఎన్టీయూలో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కడప– అనంతపురం– కర్నూలు జిల్లాల పట్టభద్రుల,ఉపాధ్యాయ మరియు అనంతపురం స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ బాక్స్ లు భద్రత, స్ట్రాంగ్ రూమ్ ఎంపిక, ఓట్ల లెక్కింపుకు అవసరమయ్యే గదులు, అక్కడ వసతుల ఏర్పాట్లు, బ్యారికేడింగ్ తదితర అంశాలపై ఆయన అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఎన్నికలకు సంబంధించి మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ , దానికి తగిన ఏర్పాట్లు వెహికల్ పార్కింగ్ కు సంబంధించి, స్థల పరిశీలన చేసి సరైన బారికేట్లతో ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు వారిని ఆదేశించారు. అదే విధంగా స్ట్రాంగ్ రూమ్ నందు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి సీసీ కెమెరాలు ఎల్లవేళలా కౌంటింగ్ పూర్తయ్యే వరకు పర్యవేక్షణలో ఉంచాలని వీడియోగ్రఫీ ని కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. కౌంటింగ్ హాల్లో సరైన క్రమంలో టేబుల్స్, ఫెన్సింగ్, రెండు వైపులా రాకపోకలు ఉండేలా ఏర్పాటు చేయాలని, చీఫ్ ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన సూచనలు మేరకు కౌంటింగ్ సక్రమంగా జరపాలని సంబంధిత అధికారులకు తెలిపారు. కౌంటింగ్ కేంద్రముల బందోబస్తు, గార్డ్, వెహికల్ పార్కింగ్ విషయం పోలీసు అధికారులతో చర్చించారు. దానితో పాటుగా రెవెన్యూ అధికారులకు కౌంటింగ్ కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేఎన్టీయూలో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కు లేఖను పంపాల్సిందిగా డి ఆర్ ఓ కు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ గాయత్రి దేవి, అనంతపురము రెవెన్యూ డివిజినల్ అధికారి మధుసూదన్, జేఎన్టీయూ ప్రొఫెసర్ చంద్రమోహన్ రెడ్డి, ఆర్ అండ్ బిఎస్ఈ ఓబుల్ రెడ్డి, ఈఈ ప్రసాద్ రెడ్డి, డిఈ బాల కాటమయ్య, నోడల్ అధికారులు నాగేశ్వర్ రెడ్డి ,హరికుమార్ ,స్థానిక తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, పోలీసు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి..

రంగారెడ్డి, ఫిబ్రవరి 18:వికారాబాద్ జిల్లా పూడూరు మండలం చిట్టెంపల్లి సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాద సంఘటన స్థలంలోనే బైక్ పై ఉన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు మద్దూర్ గ్రామం నుంచి హైదరాబాద్ వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. శ్రీనివాస్ మద్దూరు మండలం నందిగామకు చెందిన వ్యక్తి, మరో వ్యక్తి చందు సిద్దిపేట్ చెందిన వ్యక్తి. వీళ్ళిద్దరూ స్నేహితులు హైదరాబాదులో హోటల్లో ఒకే చోట పని చేస్తున్నారు. ఈ ప్రమాదం జరగడంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# దేశంలో సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి క్షేత్ర స్థాయి ఉద్యమాన్ని విస్తరణకు ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రివర్గం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు సమావేశం అయిన కేంద్ర మంత్రివర్గం దేశంలో సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి క్షేత్ర స్థాయి ఉద్యమాన్ని విస్తరించడానికి ప్రణాళిక అమలు చేయాలన్న ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పర్యవేక్షణలో కేంద్ర సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఆధ్వర్యంలో పనిచేస్తున్న సహకార మంత్రిత్వ శాఖ ఈ ప్రణాళికకు రూపకల్పన చేసింది. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఏసి), ప్రతి పంచాయతీ/గ్రామంలో పాడి సహకార సంఘాలు, తీర ప్రాంతంలో ఉన్న ప్రతి పంచాయతీ/గ్రామంలో మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేయడం, ప్రస్తుతం పనిచేస్తున్న పిఏసి/ పాడి/ మత్స్య సహకార సంఘాలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రణాళిక రూపొందింది. ' హోల్–ఆఫ్–గవర్నమెంట్' విధానంతో మత్స్య, పాడి పరిశ్రమ, పశుసంవర్ధక శాఖలు అమలు చేస్తున్న వివిధ పథకాలను నాబార్డ్, జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు సహకారంతో అమలు చేయడానికి వీలు కల్పించే విధంగా ప్రణాళిక రూపకల్పన జరిగింది. ప్రణాళికలో భాగంగా రానున్న అయిదేళ్ల కాలంలో కనిసం రెండు లక్షల బహుళ ప్రయోజన పిఏసి/పాడి/మత్స్య సహకార సంఘాలను నెలకొల్పాలని ప్రాథమిక లక్ష్యంగా నిర్ణయించారు. కార్యాచరణ ప్రణాళికను నాబార్డ్, జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు సంయుక్తంగా రూపొందిస్తాయి.

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల సహకార సంఘాల సభ్యులుగా ఉన్న రైతులు పండించిన ఉత్పత్తులను మార్కెట్ కు తరలించడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించి, రైతుల ఆదాయం పెరిగేలా చూడడం, గ్రామ స్థాయిలో రైతులకు అవసరమైన రుణ సౌకర్యాలు ఇతర సేవలు పొందడానికి అవకాశం కలుగుతుంది. పునరుద్ధరణ సాధ్యం కాని సహకార సంఘాలను రద్దు చేసి వాటి స్థానంలో నూతనంగా ప్రాథమిక సహకార సంఘాలను ఏర్పాటు చేస్తారు.

నూతనంగా గ్రామీణ ప్రాంతాల్లో పిఏసి/ పాడి/మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక వల్ల రైతులు తాము పండించిన పంటలకు ఎక్కువ ధరలు పొందుతారు. మార్కెట్ పరిధి పెరుగుతుంది. ఉత్పత్తులను సులువుగా రవాణా చేయడానికి వీలు కలుగుతుంది.

అమలు చేయడానికి అవసరమైన పథకాలను గుర్తించి వాటిని పటిష్టంగా అమలు చేయడానికి మార్గదర్శకాలను రూపొందించడానికి కేంద్ర హోం సహకార శాఖ మంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి బహుళ మంత్రిత్వ శాఖల కమిటీ ఏర్పాటవుతుంది. కమిటీ సభ్యులుగా కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ, మత్స్య, పశుసంవర్ధక పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖల మంత్రులు, సంబంధిత కార్యదర్శులు, నాబార్డ్, జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు చైర్మన్లు వ్యవహరిస్తారు.కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాల మేరకు, పటిష్టంగా అమలు జరిగేలా చూసేందుకు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు అయ్యాయి.

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు పంచాయతీ స్థాయిలో వ్యాపార కార్యకలాపాలు చేపట్టేందుకు వీలు కల్పించే విధంగా చట్ట సవరణ చేసేందుకు సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరిపిన మంత్రిత్వ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఈ మార్పుల వల్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు గిడ్డంగుల నిర్మాణం, ఆహార ధాన్యాల సేకరణ, ఎరువులు విత్తనాల సరఫరా, ఎల్పీజీ/సిఎన్జీ/పెట్రోల్/డీజిల్ అమ్మకాలు, స్వల్ప, దీర్ఘ కాలికా రుణాలు మంజూరు, వుమ్మడి సేవా కేంద్రాల ఏర్పాటు, చౌక ధరల దుకాణం ఏర్పాటు, నీటి పారుదల లాంటి 25 వ్యాపార కార్యకలాపాలు చేపట్టడానికి వీలవుతుంది. తమకు అనువుగా ఉండే విధంగా మార్పులు చేసి నూతన చట్ట నిబంధనలకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఆమోదం తెలియజేయాలని సూచిస్తూ 2023 జనవరి 5న రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు ముసాయిదా ప్రతులు పంపింది.

జాతీయ స్థాయిలో సహకార వ్యవస్థ సమాచార నిధి ఏర్పాటు చేయడానికి సహకార మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సహకార సంఘాల రెజిస్ట్రార్ల సహకారంతో పంచాయతీ/గ్రామ స్థాయిలో పనిచేస్తున్న సహకార సంఘాల వివరాలు సేకరించడానికి చర్యలు చేపట్టింది. 2021 జనవరి నాటికి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సమాచార నిధి ఏర్పాటయింది. మత్స్య/ పాడి సహకార సంఘాల సమగ్ర సమాచారం ఫిబ్రవరి నాటికి సిద్ధమవుతుంది. ఈ వివరాల ద్వారా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు లేని పంచాయతీ, గ్రామం వివరాలు తెలుస్తాయి. నూతన సహకార సంఘాలను ఏర్పాటు చేయడానికి జాతీయ సహకార డేటాబేస్, ఆన్‌లైన్ సెంట్రల్ పోర్టల్ ద్వారా చర్యలు అమలు చేస్తారు.

ఖంఆా / పాడి పరిశ్రమ / మత్స్య సహకార సంఘాలు వాటి సంబంధిత జిల్లా మరియు రాష్ట్ర స్థాయి సమాఖ్యలతో అనుసంధానం చబడతాయి. 'హోల్–ఆఫ్–గవర్నమెంట్' విధానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా, ఈ సొసైటీలు పాల పరీక్షా ప్రయోగశాలలు, బల్క్ మిల్క్ కూలర్లు, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్లు, బయోఫ్లోక్ చెరువుల నిర్మాణం, చేపల కియోస్క్‌లు,హేచరీల అభివృద్ధి, లోతైన సముద్రపు చేపలు పట్టే నౌకలను కొనుగోలు చేయడం వంటి వాటి కార్యకలాపాలను విస్తరించడానికి అవసరమైన ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకుంటాయి.

దేశంలో పనిచేస్తున్న 98,995 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో 13 కోట్ల మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. సభ్య రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పంపిణీ మొదలైన సేవలు అందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు సభ్యులకు స్వల్పకాలిక , మధ్యకాలిక రుణాలు అందిస్తూ సహకార రుణ సౌకర్యం అందిస్తున్నాయి. 352 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు,, 34 రాష్ట్ర సహకార బ్యాంకులు (రాబిఅఃలు) ద్వారా రీ ఫైనాన్స్ సౌకర్యం అందిస్తోంది.

దాదాపు 1,99,182 మంది సభ్యులను కలిగి ఉన్న ప్రాథమిక పాడి పరిశ్రమ సహకార సంఘాలు రైతుల నుంచి పాల సేకరణ, పాల పరీక్షా సౌకర్యాలు, పశువుల దాణా విక్రయం, పాడిగింపు సేవలు మొదలైన సేవలు అందిస్తున్నాయి.

దాదాపు 38 లక్షల మంది సభ్యులను కలిగి ఉన్న 25,297 ప్రాథమిక మత్స్యకార సహకార సంఘాలు పనిచేస్తున్నాయి.సమాజంలో అత్యంత అట్టడుగు స్థాయి కి చెందిన వారికి మార్కెటింగ్ సౌకర్యాలు, చేపలు పట్టే పరికరాలు, చేపల విత్తనాలు, దాణా సేకరణలో సహకారం అందిస్తున్న ప్రాథమిక మత్స్యకార సహకార సంఘాలు పరిమిత స్థాయిలో రుణ సదుపాయాలు కూడా అందజేస్తున్నాయి.

అయితే, ఇప్పటికీ దేశంలో 1.6 లక్షల పంచాయతీల్లో పీఏసీఎస్‌లు ఏర్పాటు కాలేదు. , దాదాపు 2 లక్షల పంచాయతీల్లో పాల సహకార సంఘం ఏర్పాటు కాలేదు. . దేశంలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడంలో ఈ ప్రాథమిక స్థాయి సహకార సంఘాలు పోషించే ముఖ్యమైన పాత్రను దృష్టిలో ఉంచుకుని దేశంలో సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి, అట్టడుగు స్థాయి వరకు సహకార సంఘాలను ఏర్పాటు చేసి అన్ని పంచాయితీలు/ గ్రామాలు సహకార వ్యవస్థ ప్రయోజనం పొందేలా చూసేందుకు సంఘటిత కృషి అవసరం ఉంటుంది.

# రైతులకు రేవంత్ శాల్యూట్



హైదరాబాద్, ఫిబ్రవరి 18: అరక పట్టి దుక్కి దున్నడమంటే ఇంత కష్టమా..! అంటూ టీ–పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పంటలు పండించేం దుకు రైతు లు పడుతున్న కష్టాలను స్వయంగా చూసి న ఆయన తన అనుభవాలను ట్విట్టర్ వేదికగా పంచు కున్నారు. ''హాత్ సే హాత్ జోడో'' పాదయాత్రలో భాగంగా వివిధ వర్గాల వారిని కలుస్తూ ముందుకు వెళుతున్నారు. తన 11వ రోజు పాదయాత్రకలో భాగంగా శుక్రవారం రేవంత్‌రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా పాదయాత్ర లో సేదదీరుతూ, ఆయన స్థానిక రైతులతో సరదాగా కాసేపు ముచ్చటించారు. పొలంలో అరక దున్నుతున్న ఓ రైతు వద్దకు వెళ్లి, సేద్యం తీరు తెన్నులు పరిశీలించారు. ఆ తర్వాత తాను కూడా అరక దున్నే ప్రయత్న చేశారు. అయితే, రేవంత్ నెనకున్న జనాలను చూసి బెదిరిన ఆ ఎద్దులను నియంత్రించలేక ఆపసోపాలు పడ్డారు. నాగలి కర్రను రేవంత్ గట్టిగా భూమిలోకి అదిమి పట్టు–కోలేకపోవడంతో ఆ ఎద్దులు ఇష్టారాజ్యంగా పరుగులు తీశాయి. దాంతో రేవంత్ కూడా అరక దున్నలేక ఇబ్బందిపడ్డారు. ఈ విషయాన్ని రేవంత్ రెడ్డి వీడియో సహా ట్విట్టర్‌లో వంచుకు న్నారు. వ్యవసాయం అంటే ఎంత కష్టమో అని ఆయన పేర్కొన్నారు. రైతుల శ్రమ అంతా, ఇంతా కాదని, ఇది తాను అనుభవపూర్వకంగా చెబుతున్నానని తెలిపారు. మనమేమో హాయిగా ఇళ్ల వద్ద కూర్చుని ఆహారాన్ని ఆస్వాదిస్తుంటామని పేర్కొన్నారు. రైతులందరికీ సెల్యూట్ చేస్తున్నానని ఈ సందర్భంగా రేవంత్ వెల్లడించారు.

### రైతులతో రాజకీయాలపై కాసేపు ముచ్చట

రేవంత్‌రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పాదయాత్రలో భాగంగా స్థానిక రైతులతో కాసేపు ముచ్చరించారు. పొలం పనులపైనే కాదు.. రాష్ట్ర రాజకీయాలు, కేసీఆర్ ప్రభుత్వం పైనా ఆయన ఆరా తీశారు. వారి సేద్యపు కష్టాలు, పంటల లాభ నష్టాలను గురించి తెలుసుకున్నారు. ఊరు, వాడ ఏమనుకుంటున్నారని రైతులను ఆసక్తిగా అడిగారు. కాసేపు పొలంలో అరక దున్నుతున్న రైతు వద్దకు వెళ్లి, సేద్యం తీరుతెన్నులు పరిశీలించారు.

# దివ్యాంగ జనులకు సంబంధించిన రంగంలో సహకారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:దివ్యాంగ జనుల కు సంబంధించిన రంగం లో సహకారాని కి గాను భారతదేశ ప్రభుత్వాని కి మరియు దక్షిణ ఆఫ్రికా గణతంత్ర ప్రభుత్వాని కి మధ్య అవగాహన పూర్వక ఒప్పంద పత్రం (ఎమ్ఒయు) పై సంతకాలు చేయడానికి గౌరవనీయులైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదాన్ని ఇచ్చింది.

ఈ ద్వైపాక్షిక అవగాహన పూర్వక ఒప్పందం దివ్యాంగ జనుల సంబంధి రంగం లో సంయుక్త కార్యక్రమాల ను అమలు పరచడం ద్వారా భారత గణతంత్ర ప్రభుత్వాని కి చెందిన దివ్యాంగ జనుల సాధికారిత విభాగాని కి మరియు దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వాని కి మధ్య సహకారాన్ని ప్రోత్సహించనుంది. ఇది భారతదేశాని కి మరియు దక్షిణ ఆఫ్రికా కు మధ్య ద్వైపాక్షిక సంబంధాల ను బలోపేతం చేస్తుంది. పరస్పరం అంగీకారం కుదిరే మేరకు, రెండు దేశాల మధ్య సహకారాని కి సంబంధించిన నిర్దిష్ట ప్రతిపాదనల ను ఎమ్ఒయు చెల్లుబాటు అయ్యే కాలం లో ఆచరణ లోకి తీసుకు రావడం జరుగుతుంది.

రెండు దేశాల లో దివ్యాంగ జనులు (పిడబ్ల్యుడి స్) మరియు వార్ధక్యం బారిన పడ్డ జన సంఖ్య కు మరీముఖ్యం గా అవసరం అయ్యేటటువంటి ఆధునికమైన, విజ్ఞాన శాస్త్ర సంబంధమైన, మన్నికైన, తక్కువ ఖర్చు లో లభ్యం కాగల ఉపకరణాల ను మరియు సహాయక సాధనాల ను అందించాలి అనేది ఈ ఎమ్ఒయు యొక్క ముఖ్య ఉద్దేశ్యం గా ఉంది.

గాంధీ మహాత్ముడు ఒక వంద సంవత్సరాల కాలాని కంటే పూర్వం దక్షిణ ఆఫ్రికా లో సత్యాగ్రహ ఉద్యమాన్ని మొదలు పెట్టిన కాలం నుండి స్వాతంత్ర్యం కోసం మరియు న్యాయం కోసం పోరాటం సాగిన నేపథ్యం లో దక్షిణ ఆఫ్రికా మరియు భారతదేశం ఒక సుదీర్ఘమైనటువంటి చరిత్రాత్మక బంధాన్ని మరియు సంబంధాల ను ఏర్పరచుకొన్నాయని చెప్పాలి. జాతి విచక్షణ కు వ్యతిరేకం గా సాగిన ఉద్యమాని కి సంఘీభావాన్ని వ్యక్తపరచిన అంతర్జాతీయ సముదాయం లో భారతదేశం ముందువరుస లో నిలబడింది. స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతర కాలం లో, 1993 వ సంవత్సరం లో దక్షిణ ఆఫ్రికా తో దౌత్య సంబంధాల పునరుద్ధరణ చోటు చేసుకొంది. మరి ఆ తరువాత కాలం లో అంటే 1997 వ సంవత్సరం లో మార్చి మాసం లో భారతదేశం మరియు దక్షిణ ఆఫ్రికా ఒక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నెలకొల్పుకొన్నాయి. తదనంతరం, దక్షిణ ఆఫ్రికా తో ద్వైపాక్షిక స్థాయి లోను, బిఆర్ఐసిఎస్, ఐబిఎస్ఎ తదితర వేదిక ల ద్వారాను మన మధ్య సన్నిహిత, మిత్రపూర్వక సంబంధాలు దృఢ తరంగా మారాయి. ఆర్థిక సహకారం, వాణిజ్య పరమైన సహకారం, రక్షణ, సంస్కృతి, ఆరోగ్యం, మానవీయ ఒప్పందాలు, సార్వజనిక పరిపాలన, విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతిక విజ్ఞానం వంటి విభిన్న రంగాల లో రెండు దేశాల కు మధ్య అనేక ద్వైపాక్షిక ఒప్పందాలు రూపు ను దాల్చాయి. మానవ వనరుల అభివృద్ధి లో సహకారాన్ని ప్రోత్సహించడం లో భారతదేశాని కి చెందిన టెక్నికల్ ఎండ్ ఇకానామిక్ కోఆపరేశన్ ప్రోగ్రామ్ (ఐటిఇసి) ఒక ఉపయోగకరమైనటువంటి మాధ్యం గా పాటుపడింది. కోవిడ్–19 మహమ్మారి కి ఎదురొడ్డి పోరాడడం తో పాటుగా ఇతర ప్రపంచ స్థాయి సవాళ్ళ ను పరిష్కరించడం లో దక్షిణ ఆఫ్రికా కు మరియు భారతదేశాని కి మధ్య ద్వైపాక్షిక సహకారం చెప్పుకోదగ్గది గా ఉండింది. వేరు వేరు ఇతర మంత్రిత్వ శాఖలు/విభాగాలు కూడా వాటి కి సంబంధించినటువంటి రంగాల లో సహకారం కోసం ఎమ్ఒయు ల పైన/ ఒప్పంద పత్రాల పైన సంతకాలు చేశాయి. ఈ పరిణామాలు దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వం తో గాఢతరమైన సంబంధాల ను చాటి చెబుతున్నాయి.

# శ్రీశైలంలో భక్తజన సందోహం..



శ్రీశైలం , ఫిబ్రవరి 18:మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో మహాశివరాత్రి శోభ కనిపిస్తోంది. ఆలయాలన్నీ శివ నామస్మరణతో మార్మోగుతున్నాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్దఎత్తున శివాలయాలకు పోటెత్తారు. శివయ్యకు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహిసున్నారు. మహ శివరాత్రి సందర్భంగా శ్రీశైలం ఆలయానికి భక్తులు పోటెత్తారు ఆలయ క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శ్రీశైలం ఆలయం శివభక్తులతో నిండిపోయింది.. శ్రీశైలంలో స్వామివారి దర్శనానికి సుమారు ఆరుగంటలు సమయం పడుతోంది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు స్వామి అమ్మవార్ల ను దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొంటున్నారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 19న సాయంత్రం 5 గంటలకు రథోత్సవం.. రాత్రి 8 గంటలకు తెప్పోత్సవం జరుగుతుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 21 వరకు అన్ని ఆర్జిత సేవల టికెట్లను ఆపేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాలను పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పది లక్షల మంది భక్తులు బ్రహ్మోత్సవాలకు వస్తారన్న అంచనా వేస్తున్నారు.

# వ్యవసాయం పరిశ్రమగా విస్తరించాలి : మంత్రి నిరంజన్ రెడ్డి



మెదక్, ఫిబ్రవరి 18: (నేటినిజం ప్రతినిధి): ఆధునిక పరికరాలు వ్యవసాయ రంగానికి ఎంతో అవసరమని, నూతన టెక్నాలజీతో ఏర్పాటు చేస్తున్న పరికరాలతో రైతులకు వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందుతున్నారని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. మండలంలోని టీఎస్ఐఐసి పారిశ్రామిక వాడలోని అక్షయ అగ్రి పరిశ్రమను మంత్రి నిరంజన్ రెడ్డి పరిశీలించారు. పరిశ్రమ యజమానులు మంత్రికి వివరిస్తూ.. రూ.20 కోట్ల వ్యయంతో 1 స్థలంలో ఆర్అండ్ డి పరిశ్రమ ఏర్పాటు చేశామని, అలాగే సిరిసిల్ల టిఎస్ఐఐసి పారిశ్రామిక వాడలో రు.60 కోట్ల వ్యయంతో 20 ఎకరాల విస్తీర్ణంలో నూతన పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు సూచించారు. పరిశ్రమ ఆవరణలో మంత్రి మొక్కను నాటారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయం ఒక పరిశ్రమగా విస్తరించాలని, వ్యవసాయ రంగంలో దేశం మొత్తం తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటుందని రైతులకు వ్యవసాయ ఆధునిక పరికరాలు అందించడం ఎంతో అవసరమన్నారు. దేశంలో వ్యవసాయ పనితీరు మారాలని రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడానికి ఆధునిక యంత్రాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నూతన ఆధునిక వ్యవసాయ యంత్రాంగ పరిశ్రమలు ఏర్పాటు చేయడం భేష్ అని యాజమాన్యాన్ని అభినందించారు. రాష్ట్రంలో 91% రైతులు 5 ఎకరాల లోపే ఉన్నారని తక్కువ భూమి ఉన్న అందులో అద్భుతమైన పంటలు పండించే సత్తా తెలంగాణ రైతులకు ఉందని సూచించారు. రాష్ట్రంలో రైతాంగ అభివృద్ధి పరచడం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రైతులు కష్టంతో కాకుండా ఇష్టంతో పని చేస్తూ సులభంగా పంటలు పండించే విధంగా వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దుతామని, దేశంలో మౌలిక వసతులు అనేక రంగాల్లో ఉన్నాయని ప్రపంచంలో అన్ని దేశాలకు భారతదేశమే ఆహారం అందించగల సత్తా ఉందన్నారు.

# సిఎస్ఆర్ చొరవల కింద టిఇఆర్ఐతో అవగాహనా ఒప్పందంపై సంతకం చేసిన ఎస్పిఎంసిఐఎల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:భారత ప్రభుత్వ యాజమాన్యంలోని మినీ రత్న కేటగిరీ -1 సిపిఎస్ ఇ అయిన సెక్యూరిటీ ప్రింటిండగ్ అండ్ మైనింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్పిఎంసిఐఎల్), ది ఎనర్జీ రీసోర్సెస్ ఇనిస్టిట్యూట్ (టిఇఆర్ఐ) ఎస్పిఎంసిఐఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అవగాహ నా ఒప్పందంపై సంతకాలు చేశాయఎస్పిఎంసిఐఎల్ సిఎస్ఆర్ చొరవల కింద రూ. 525.49 లక్షల అంచనా వ్యయంతో మధ్య ప్రదేశ్ లోని దేవాస్ జిల్లాలోని సిరోలియాను సామాజిక అభివృద్ధి, సమగ్రాభివృద్ధితో మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఎస్పిఎంసిఐఎల్ డైరెక్టర్ (హెచ్ఆర్) శ్రీ ఎస్.కె. సిన్హా, చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) శ్రీ బిజె గుప్తా, జాయింట్ జిఎం (హెచ్ఆర్) శ్రీ ప్రకాశ్ కుమార్, కన్సల్టెంట్ శ్రీ వినోద శర్మ హాజరుకాగా, టిఇఆర్ఐకు అసోసియేట్ డైరెక్టర్ ఉ సిఎస్ఆర్ శ్రీ అమిత్ కుమార్ ఠాకూర్ డరీసెర్చ్ అసోసియేట్ మితాక్షా రస్వంత్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఏడుపాయల వనదుర్గ మాతకు పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి హరీశ్ రావు..



మెదక్, ఫిబ్రవరి 18: (నేటినిజం ప్రతినిధి):ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన ఏడుపాయలలో మహా శివరాత్రి జాతర శనివారం వైభవంగా ప్రారంభం అయ్యింది. రాష్ట్ర పండుగ కావడంతో ప్రభుత్వం తరపున ఆర్థిక శాఖా మంత్రి హరీశ్ రావ్, మెదక్, నర్సాపూర్ ఎమ్మెల్యే లు పద్మా దేవేందర్ రెడ్డి, మదన్ రెడ్డితో కలిసి వనదుర్గ భవాని మాతకు పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల పువ్వులతో అందంగా అలంకరణ చేశారు. వనదుర్గా భవాని మాత విశేష అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఏడుపాయల ప్రాంగణం సందడిగా మారింది. తెల్లవారుజాము అమ్మవారికి అభిషేకం అలంకరణ చేసి అర్చన నిర్వహించి జాతర వేడుకలకు ఆలయ అర్చకులు శ్రీకారం చుట్టారు .ఓవైపు శివనామస్మరణతో మరోవైపు దుర్గమ్మ నామస్మరణతో ఏడుపాల ఆలయం మార్మోగింది. ఏడుపాయల వనదుర్గా భవాని మాత ప్రత్యేక అలంకరణతో ఆకట్టుకుంది. పూజారులు అమ్మవారిని పట్టుచీర, బంగారు కిరీటం, హారాలు, ముక్కుపుడకతో అలంకరించారు. గజమాలలు, గులాబీ పువ్వుల అలంకరణతో అమ్మవారి రూపం ఎంతో ఆకర్షణీయంగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ మండపాన్ని, ప్రాంగణాన్ని, ధ్వజస్తంభాన్ని రంగు రంగుల పువ్వులతో అలంకరించారు. రాజగోపురం నుంచి ఆలయానికి వెళ్లే దారిలో ఆకట్టుకునేలా అరటి కొమ్మలు కమాన్?లు ఏర్పాటు చేశారు...అనంతరం మంత్రు హరీష్ రావు, ఎమ్మెల్యే పద్మా దేవేందర్? రెడ్డి మదన్ రెడ్డి కలిసి కలిసి గర్భగుడి ముందు మంజీరా నదీ పాయ మధ్యలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివుని వద్ద పూజలు చేశారు...ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.రాష్ట్ర ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలుపుతూమెదక్ జిల్లాలో ఏడుపాయల అమ్మవారి ఉత్సవాలను అత్యంత ఘనంగా ఈ శివరాత్రి పర్వదినాన అధికారిగా లాంఛనాలతో జరుపుకోవడం జరిగింది. శివుడి దయతో ప్రజలందరూ కూడా సుఖసంతోషాలతో , ఆయురారోగ్యాలతో ఉండాలని, ఈ రాష్ట్రం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఇంకా అగ్ర భాగాన ఉండేవిధంగా ఆ పరమశివుడు ఆశీస్సులు అందజేయాలని ప్రార్థించడం జరిగిందన్నారు.. ముఖ్యంగా ఏడుపాయలు దినదిన అభివృద్ధి జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకముఖ్యంగా ఏడుపాయలకు రహదారులు చాలా చక్కగా ఇరువైపుల నుంచి అయ్యాయని, భక్తుల సౌకర్యాలు మెరుగుపడ్డాయిని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ పుణ్యక్షేత్రం పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు.ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద ఎత్తున ఈ ప్రాంతని కి నిధులు కేటాయిస్తూ దేవాలయ అభివృద్ధికి హితోదికంగా సహాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం కూడా ముఖ్యమంత్రి రెండు కోట్ల రూపాయలను నిర్వహణ కోసం ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందన్నారు. దేవాలయం కూడా శివుడి దయతో ప్రతి సంవత్సరం చక్కగా అభివృద్ధి జరుగుతుంది అన్నారు. ముఖ్యమంత్రి ఎంతో భక్తితో ,విశ్వాసంతో ఈ రాష్ట్రంలో అనేక దేవాలయాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయన్నీ భూలోక వైకుంఠంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ మధ్యనే కొండగట్టుకు వెళ్లి ఆ హనుమంతుడి యొక్క దేవాలయాన్ని 1000 కోట్ల రూపాయలైనా సరే అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దడానికి నిర్ణయించి ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని దేవాలయాలను ఎంతో భక్తితో ,విశ్వాసంతో అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ రోజు కూడా మతాన్ని, దేవాలయాలను రాజకీయాలకు వాడుకోలేదన్నారు. యాదాద్రి లాంటి అద్భుతమైన దేవాలయం నిర్మించిన ఎన్నికలు వచ్చేదాకా మెల్ల మెల్లగా కట్టి ఎన్నికల ముందు ప్రారంభించాలనే ఆలోచన ముఖ్యమంత్రి చేయలేదని అన్నారు.ముఖ్యమంత్రి ఏం చేసినా ఒక విశ్వాసంతో దేవుడి మీద భక్తితో చేశారని తెలిపారు. మా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలందరూ కూడా గర్వించే విధంగా దేవాలయాలు అభివృద్ధి చెందాయన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వాలు రాష్ట్ర బడ్జెట్లో దేవాలయాలకు నిధులు కేటాయించిన దాఖలాలు లేవని అన్నారు. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేవాలయాలను అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో ప్రత్యేకంగా దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. అర్చకుల సంక్షేమ కోసం , పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం, వారి విద్య ఉపాధిలో విదేశీ విద్య కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయడం జరుగుతుంది అన్నారు. దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా ప్రతి నెల మొదటి వారంలో జీతం వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ గా నిధులు కేటాయిస్తూ దేవాలయ ఉద్యోగులను కూడా ఆదుకుంటుందన్నారు. దేవాలయ ఉద్యోగులు , అర్చకులు, బ్రాహ్మణుల సంక్షేమ కోసం కృషి చేసినటువంటి ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ ది అన్నారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించేది బ్రాహ్మణులు, అర్చకులు, దేవాలయ ఉద్యోగులని వారి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేయడం అంటే హిందూ ధర్మ పరిరక్షణ పూర్తిగా కాపాడడం అన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా,ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రరమేష్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈ ఓ శ్రీనివాస్, ఆర్.డి.ఓ సాయి రామ్, జెడ్.పి.టి.సి లు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో పర్యాటక ప్రాంతంగా కురవి : మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్, ఫిబ్రవరి 178:(నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో మహా శివరాత్రి పురస్కరించుకొని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని రాష్ట్ర గిరిజన, స్త్రీ ? శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు వీరభద్ర స్వామి ఆలయ అర్చకులు మంత్రిగారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కురవి జాతరలో బూర ఊది మంత్రి సత్యవతి రాథోడ్ సందడి చేశారు. జాతరలో చిరు వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సత్యవతి రాథోడ్ మిడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర, జిల్లా ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ముక్కుకున్నట్లు తెలిపారు. శివరాత్రి రోజున భక్తిశ్రద్ధలతో శివనామం జపిస్తూ చేపట్టే ఉపవాస దీక్షలు, రాత్రి జాగరణ, పూజలు అభిషేకాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతీ ఒక్కరిలో ఆత్మశుద్ధిని, పరివర్తనను కలిగిస్తాయని మంత్రి అన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో శివరాత్రి పండుగను జరుపుకోవాలని కోరారు. మహాశివుని కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. కురవి ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఐదు కోట్లు కేటాయించారన్నారు. 75 శాతం పనులు పూర్తయ్యాయి వచ్చే ఏడాది శివరాత్రి కల్లా పనులన్నీ పూర్తవుతాయన్నారు. త్వరలో పర్యాటక ప్రాంతంగా కురవిని తీర్చిదిద్దుతామన్నారు. ఈ ప్రాంతంలో హరిత హోటల్ ఏర్పాటుకు నివేదిక కూడా అందించడం జరిగిందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు, అవసరమైతే మరిన్ని నిధులు కేటాయించేందుకు కృషి చేస్తా అన్నారు. తెలంగాణ సుభిక్షంగా ఉంచేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారు. రాబోయే రోజులలో దేశంలోనే గొప్ప నాయకుడు కేసీఆర్ అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్ తో పాటు ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, కురవి జడ్పిటిసి బండి వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ డా.రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎండి ఫరీద్, జిల్లా కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్ చంద్ర పవార్ మరియు బీఆర్ఎస్ నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, వల్లూరి కృష్ణారెడ్డి, నెహ్రు నాయక్, జీవన్ నాయక్, బొడ శ్రీను నాయక్, భద్రు, నాగన్న, డాక్టర్ సుందర్ నాయక్, బొమ్మకంటి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# 11.94 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:ఇంటలిజెన్స్ నుంచి పక్కాగా అందిన సమాచారం ఆధారంగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ (డీఆర్ఐ) అధికారులు నిన్న హరారే నుండి కెన్యా ఎయిర్‌వేస్ ద్వారా నైరోబీ మీదుగా ముంబయికి వస్తున్న ఒక భారతీయ మహిళా ప్రయాణికురాలిని అడ్డుకున్నారు. ఈ ప్రయాణికురాలి లగేజీని పరిశీలించగా అందులో 11.94 కిలోల క్రీము రంగు కణికలను గమనించి స్వాధీనం చేసుకున్నాయి. వీటిని నార్కోటిక్స్ ఫీల్డ్ టెస్టింగ్ కిట్‌తో పరీక్షించగా అందులోఎన్‌డీపీఎస్ చట్టం, 1985 కింద కవర్ చేయబడిన మాదకద్రవ్యమైన "హెరాయిన్" అనే పదార్థం ఉన్నట్లు నిర్ధారించబడింది. స్వాధీనం చేసుకున్న ఎన్‌డీపీఎస్ పదార్థం మొత్తంగా 11.94 కిలోల బరువు ఉంది, దీని విలువ అక్రమ మార్కెట్‌లో సుమారుగా రూ.84 కోట్ల మేర ఉంటుంది. ట్రాలీ బ్యాగ్‌ల లోపల మరియు ఫైల్ ఫోల్డర్‌లలో ఈ పదార్థం తెలివిగా దాచబడింది. మహిళా ప్రయాణికురాలిని విచారించగా హరారేలో తనకు ఈ డ్రగ్స్ బ్యాగేజీ అందజేశారని, ముంబైలోని ఇద్దరికి డెలివరీ చేయాల్సి ఉందని తెలిపారు. ఈ విషయం వేగంగా స్పందించిన డీఆర్ఐ అధికారులు ముంబయి విమానాశ్రయం వెలుపల నిషిద్ధ వస్తువులను స్వీకరించడానికి వచ్చిన గ్రహీతలను గుర్తించి పట్టుకున్నారు. ఎన్.డి.పి.ఎస్ చట్టం- 1985లోని నిబంధనల ప్రకారం ప్రయాణీకురాలు మరియు ఇతర ఇద్దరిని అరెస్టు చేశా రు. తదుపరి విచారణ కొనసాగుతోంది.

# శివయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే దాసరి

కరీంనగర్, ఫిబ్రవరి 18: (నేటినిజం ప్రతినిధి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పరమ శివుడిని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు.

శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శివాలయంలో మహా శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి

మొక్కులు చెల్లించారు. స్వామివారికి ప్రేమలే దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. దర్శన అనంతరం ఆలయ కమిటీ ఎమ్మెల్యే ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందులో కృష్ణమూర్తి, విశ్వనాథ్, తినేటి రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో ఇవాళ 'సంప్రదాయ విజ్ఞాన ఆదాన ప్రదానం.. ప్రసంగించిన కేంద్రమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:ప్రజా శ్రేయస్సు లక్ష్యంగా సంప్రదాయ జ్ఞానంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మేళవింపును ప్రోత్సహిం చడం, భవిష్యత్తరం సాంకేతికతపై సమాచారం పంచుకోవడంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఎప్పుడూ ముందుంటారని కేంద్ర శాస్త్ర-సాంకేతిక మంత్రిత్వ శాఖ, భూవిజ్ఞాన శాఖ, ప్రధాని కార్యాలయ, ప్రజా ఫిర్యాదులు- పెన్షనన్లు, అణుశక్తి-అంతరిక్ష శాఖల (స్వతంత్ర బాధ్యతగల) సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు.

న్యూఢిల్లీలో ఇవాళ 'సంప్రదాయ విజ్ఞాన ఆదానప్రదానం-వ్యాప్తిపై తొలి అంతర్జాతీయ సదస్సు' (సిడిటికె-2023)కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సంప్రదాయ విజ్ఞానాన్ని, ఆధునిక శాస్త్ర పరిశోధనలను మేళవించడంతోపాటు ఆధునిక ఉపకరణాలు, సాంకేతికతల సమన్వయంతో సమష్టిగా గరిష్ఠస్థాయిలో వినియోగించాలని డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సంప్రదాయ విజ్ఞాన డిజిటల్ గ్రంథాలయాన్ని (డిజిటిఎల్) ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చిన నేపథ్యంలో విజ్ఞానంతో సాంకేతికత మేళవింపు సామాన్యులకు ఎంతో ప్రయోజనకరమని రుజువైందన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా 'స్వస్తిక్ (శాస్త్రీయ ధ్రువీకృత భారత సామాజిక సంప్రదాయ జ్ఞానం) కరదీపికతోపాటు పాపులర్ సైన్స్ బుక్, ఇండియన్ జర్నల్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్ స్వాతంత్ర్య అమృత మహోత్సవ సంచికను కూడా కేంద్ర మంత్రి ఆవిష్కరించారు. కాగా, న్యూఢిల్లీలోని 'సిఎస్ఐఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్ (సిఎస్ఐఆర్?న్ఐఎస్‌సీపీఆర్) సంస్థ ఈ రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తోంది. గత 8 ఏళ్లలో ప్రధాని మోదీ నాయకత్వాన సంప్రదాయ విజ్ఞానం, ఆధునిక శాస్త్రీయ పరిశోధనల సమన్వయంపై దృష్టి సారించే అనేక కార్యక్రమాల ద్వారా నేడు మహా సముద్రాల వంటి దేశీయ వనరులకు అత్యంత ప్రాధాన్యం లభిస్తున్నదని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు హిందూ మహాసముద్రంలో (సంప్రదాయకంగా హింద్ మహాసాగర్) చేపట్టిన 'డీప్ సీ మిషన్', ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో లవెండర్ సాగును ప్రోత్సహించే 'పర్పుల్ రివల్యూషన్ వంటివాటిని ఆయన ఉదాహరించారు. వీటిద్వారా స్థానిక కశ్మీరీలకు భారీ ఉపాధి అవకాశాలు అందివచ్చాయని పేర్కొన్నారు.

ఈ తొలి అంతర్జాతీయ సదస్సును ఇంత భారీస్థాయిలో చక్కని ఇతివృత్తంతో నిర్వహించడంపై 'సిఎస్ఐఆర్?న్ఐఎస్‌సీపీఆర్'లను అభినందించారు. భారతదేశం అతిపెద్ద లిఖిత, మౌఖిక, అనువర్తిత సుసంపన్న జ్ఞానఖనిగా వెలుగొందుతున్నదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వాస్తవాన్ని ప్రస్ఫుటం చేసేవిధంగా ఈ జ్ఞానాన్ని అత్యుత్తమంగా వాడుకోవడం ఎలాగన్నదే నేడు మనముందున్న సవాలని ఆయన అన్నారు. ఈ రెండింటి మధ్య సరైన సమతౌల్యం కనుగొనడం ద్వారా ఇది సుసాధ్యం కాగలదని, ఈ దిశగా ఏకీకరణ, ఆలోచనాత్మక ప్రక్రియ అవసరమని డాక్టర్ సింగ్ చెప్పారు. ఈ రంగంలో భారత్ ప్రపంచ అగ్రగామిగా నిలిచేందుకు ఇదే సరైన సమయమన్నారు. ప్రధాని మోదీ హయాంలో శాస్త్ర-సాంకేతిక పరిశోధనలకు మునుపెన్నడూ లేనివిధంగా మద్దతు లభిస్తోందని ఆయన అన్నారు.

మహమ్మారిపై యుద్ధంలో ప్రపంచమంతా ఒక్క టీకా తయారీకే ఆపసోపాలు పడుతున్న సమయంలో ప్రధాని మోదీ నాయకత్వాన భారతదేశం ఏకంగా నాలుగు కోవిడ్-19 టీకాలను రూపొందించిందని గుర్తుచేశారు. అంతేకాకుండా కోవిడ్-19పై ప్రపంచ పోరాటంలో తనవంతుగా 'వ్యాక్సిన్ మైత్రి' కింద పలు చర్యలతోపాటు అనేక దేశాలకు టీకాలను అందించిందని పేర్కొన్నారు. తద్వారా భారత సంప్రదాయ, మానవ విలువలకు విశేష ప్రాచుర్యం లభించిందని చెప్పారు. సంప్రదాయ జ్ఞానం ప్రమాదంలో ఉన్నప్పుడు, అది సత్వరం స్వీకరించబడుతుందని, ఏకీకరణతోపాటు వనరుల సమీకరణ ద్వారా ఆధునిక యుగంలో మనకొక సానుకూల అవకాశం కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సీఎస్ఐఆర్ డీజీ, డీఎస్ఐఆర్ కార్యదర్శి డాక్టర్ కలైసెల్వి మాట్లాడుతూ- శాస్త్ర-విజ్ఞాన పరిశోధనలు స్వేచ్ఛగా నిర్వహించుకునే స్వర్ణయుగంలో నేడు మనం జీవిస్తున్నామని పేర్కొన్నారు. ఆ మేరకు అంకుర సంస్థలను, పరిశోధకులను ప్రోత్సహిస్తున్న ఘనత ప్రధానమంత్రి మోదీకే దక్కుతుందన్నారు. కాగా, 2023 ఫిబ్రవరి 14, 15 తేదీల్లో నిర్వహించిన ఈ రెండు రోజుల సదస్సులో దేశంలోని 22 రాష్ట్రాలుసహా అమెరికా, కెనడా, స్విట్జర్లాండ్, ఖతార్, టర్కీ దేశాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు.


ఆహ్వానం

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా

ఫిబ్రవరి 21,2023

**ఉదయం**

తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాభిషేకం

ఉ.10.00 గం.లకు, అన్నమయ్య పార్కు ప్రాంగణం

**సాయంత్రం**

అన్నమయ్య కళావేదిక, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం, బృందావన్ గార్డెన్స్, గుంటూరు సా.06.00 గం.లకు

అధ్యక్షత: సరస వచోనిధి డా.ఎం.లలితకుమారి

ముఖ్య అతిథి: డా.పాపినేని శివశంకర్ కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కార గ్రహీత

ఆత్మీయ అతిథి: చిటిపోతు మస్తానయ్య దేవాలయ పాలకమండలి అధ్యక్షులు

పద్య గానం: ఈవూరి వెంకటరెడ్డి పద్య కవి, గాయకుడు
గాడేపల్లి మల్లికార్జునుడు కవి, గాయకుడు

ఆత్మీయ సత్కారం: డా. పి.వి.సుబ్బారావు సాహితీ విమర్శకులు
ఈవూరి వెంకటరెడ్డి పద్య కవి, గాయకుడు

నాట్య ప్రదర్శన: వల్లమన్నాటి నాగజ్యోతి 10వ తరగతి విద్యార్థిని

పోటీల్లో గెలుపొందిన కళాశాల విద్యార్థినులకు బహుమతి ప్రదానం

ఎస్.ఎం. సుభాని ప్రధాన కార్యదర్శి
సోమేపల్లి వెంకటసుబ్బయ్య అధ్యక్షుడు

గుంటూరు జిల్లా రచయితల సంఘం


# రికార్డ్ స్థాయి క్యూ3 ఉత్పత్తిని సాధించిన ఎన్ఎండీసీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:ప్రభుత్వ రంగం మైనింగ్ సంస్థ ఎన్ఎండీసీ, ఎఫ్‌వై23 మూడో త్రైమాసికంలో 10.66 మిలియన్ టన్నుల ఉత్పత్తితో అత్యుత్తమ క్యూ3 గణాంకాలను నమోదు చేసింది.

ఈ ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో రూ.11,816 కోట్ల టర్నోవర్ సాధించినట్లు 14.02.2023న జరిగిన డైరెక్టర్ల బోర్డు సమావేశంలో ఎన్ఎండీసీ ప్రకటించింది.

తొమ్మిది నెలలకు ఈ సంస్థ పన్నుకు ముందు లాభం (పీబీటీ) రూ.4351 కోట్లుగా, ఇదే కాలానికి పన్ను తర్వాతి లాభం (ప్యాట్) రూ.3252 కోట్లుగా లెక్క తేలింది.

ఎఫ్‌వై23 మూడో త్రైమాసికంలో, 10.66 మిలియన్ టన్నుల (ఎంఎన్‌టీ) ఇనుప ఖనిజాన్ని ఎన్ఎండీసీ ఉత్పత్తి చేసింది, 9.58 మిలియన్ టన్నులను విక్రయించింది. మొదటి మూడు త్రైమాసికాల్లో మొత్తం ఉత్పత్తి, విక్రయాల గణాంకాలు వరుసగా 26.69 ఎంఎన్‌టీ, 25.81 ఎంఎన్‌టీగా ఉన్నాయి.

ఒక్కో షేరుకు రూ.3.75 మధ్యంతర డివిడెండ్‌ను ఈ కంపెనీ ప్రకటించింది.

కంపెనీ పనితీరుపై మాట్లాడిన ఎన్ఎండీసీ సీఎండీ శ్రీ సుమిత్ దేబ్, "భారతదేశ మౌలిక సదుపాయాల వృద్ధికి ఇనుము ఉ ఉక్కు పరిశ్రమ వెన్నెముక.

ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో మూలధన వ్యయాన్ని పెంచడంపై దృష్టి సారించడం వల్ల దేశీయ ఉక్కు డిమాండ్ బలంగా పెరుగుతుంది. పెరుగుతున్న ఇనుప ఖనిజం ఉత్పత్తి ఉ కంపెనీలతో పెట్టుబడుల సాయంతో, దేశీయ డిమాండ్‌ను తీర్చడానికి ఎన్ఎండీసీ సిద్ధంగా ఉంది. అత్యుత్తమ క్యూ3 ఉత్పత్తి సాధించిన ఎన్ఎండీసీ బృందాన్ని అభినందిస్తున్నా" అని చెప్పారు.

# డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధిపతి అనుచిత వ్యాఖ్యలు చేసారని అంటూ ఒక పత్రికలో వచ్చిన వార్త తప్పు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:నర్సుల పట్ల డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధిపతి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ది మార్నింగ్ స్టాండర్డ్ లో వచ్చిన వార్త తప్పుదోవ పట్టించే విధంగా ఉంది. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తన వద్దకు వచ్చిన నర్సుల బృందాన్ని ఉద్దేశించి కొద్ది రోజుల కిందట డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధిపతి అనుచిత వ్యాఖ్యలు చేశారని పత్రిక పేర్కొంది. నర్సుల పట్ల గౌరవం, సానుభూతి లేకుండా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధిపతి ప్రవర్తించారని వార్తలో పేర్కొన్నారు. చిన్న విషయంపై అనవసర రాద్ధాంతం సృష్టించే విధంగా వార్త ఉంది.

నర్సింగ్ తో సహా అన్ని ఆరోగ్య అంశాలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (ఆడఉబా నేతృత్వంలో) ఒక సాంకేతిక సంస్థగా పనిచేస్తూ సమస్య పరిష్కారానికి అనుసరించాల్సిన విధానాలు సూచిస్తుంది. నర్సింగ్ అంశంతో సహా ఆరోగ్య రంగానికి సంబంధించిన విధాన నిర్ణయాలు , వాటి అమలు బాధ్యత కేంద్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పై ఉంటుంది. పని విభజన వల్ల డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, మంత్రిత్వ శాఖ మధ్య సామరస్య పూర్వకంగా పని చేయగలుగుతున్నాయి.

నర్సుల అంశానికి సంబంధించి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ లో ప్రస్తుతం నర్సింగ్ సలహాదారు, ఏడీజీ (నర్సింగ్),డిప్యూటీ అసిస్టెంట్ డీజీ (నర్సింగ్) డిప్యూటీ నర్సింగ్ సలహాదారు. పనిచేస్తున్నారు. ఈ పోస్టులను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ నుంచి మంత్రిత్వ శాఖకు బదిలీ చేయాలని కొన్ని నర్సింగ్ సంఘాలు కోరుతున్నాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెన్ అందిస్తున్న సాంకేతిక సలహాలు ఆధారంగా మంత్రిత్వ శాఖ, తగిన నిర్ణయాలు తీసుకుంటూ సంతృప్తికరంగా పనిచేస్తోంది. దీంతో కొన్ని నర్సింగ్ సంఘాలు కోరుతున్న విధంగా పోస్టులను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ నుంచి బదిలీ చేయడానికి మంత్రిత్వ శాఖకు సముఖంగా లేదు.

నర్సింగ్ వృత్తిపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ సానుకూలంగా వ్యవహరిస్తూ వైద్యరంగంలో నర్సింగ్ సముచిత స్థానాన్ని సాధించాలని కోరుకుంటుంది. ఒక వర్గానికి చెందిన నర్సులు , డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ పనిచేస్తున్న నాలుగు టెక్నికల్ నర్సింగ్ పోస్టుల పట్ల అసంతృప్తితో ఉన్నారు. ఈ పోస్టులను మంత్రిత్వ శాఖకు బదిలీ చేయాలని కోరుతున్నారు. వార్తలో ప్రస్తావించిన ఈ-మెయిల్ నర్సింగ్ అసోసియేషన్‌లకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెన్ పంపిన ప్రతిస్పందన. దీనిలో నర్సుల సంఘం నుంచి వినతి పత్రం అందిందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ పేర్కొంది. డైరెక్టరేట్ మంత్రిత్వ శాఖలో అంతర్భాగమని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెన్ భావిస్తోంది. నర్సుల సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి మంత్రిత్వ శాఖలోని నర్సింగ్ ప్రోగ్రామ్ విభాగం తో కలిసి పనిచేయడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ సిద్ధంగా ఉంది.

# 'ఏరో ఇండియా 2023'లో వివిధ దేశాల రక్షణ శాఖల ప్రతినిధులతో భారత రక్షణ కార్యదర్శి చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:బెంగళూరులో జరుగుతున్న 'ఏరో ఇండియా 2023' సందర్భంగా, 2023 ఫిబ్రవరి 14న, భారత రక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ గిరిధర్ అరమణే వివిధ దేశాల రక్షణ శాఖల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి మతార్ సలేమ్ అలీ మర్రాన్ అల్దాహేరీ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ద్వైపాక్షిక సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య ప్రస్తుతం ఉన్న రక్షణ సహకార అంశాలపై రెండు వర్గాలు చర్చించాయి, కొనసాగుతున్న సైనిక సంబంధాలపై సంతృప్తి వ్యక్తం చేశాయి.

లెఫ్టినెంట్ జనరల్ కన్ మైంత్ థాన్ నేతృత్వంలోని మయన్మార్ ప్రతినిధి బృందాన్ని కూడా భారత రక్షణ శాఖ కార్యదర్శి కలిశారు. ప్రస్తుతం కొనసాగుతున్న రక్షణ సహకార అంశాలపై చర్చించారు.

బ్రెజిల్‌తోనూ ద్వైపాక్షిక సమావేశం జరిగింది. బ్రెజిల్ ప్రతినిధి బృందానికి ఆ దేశ రక్షణ ఉత్పత్తుల విభాగం అధిపతి మేజ్ బ్రిగ్ రుయ్ చగాస్ మెస్క్విటా నేతృత్వం వహించారు. రక్షణ పారిశ్రామిక ఉత్పత్తులపై పరస్పర సహకారం, భవిష్యత్‌లోనూ దానిని కొనసాగించడంపై భారత్-బ్రెజిల్ అధికారులు చర్చించారు.

కంబోడియా రక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి జనరల్ యున్ మిన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో భారత రక్షణ కార్యదర్శి సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య ప్రస్తుత సహకారాన్ని సమీక్షించిన ఇరువురు అధికారులు, రక్షణ సహకారాన్ని మరింత పెంపొందించే మార్గాలపై చర్చించారు.

రిపబ్లిక్ ఆఫ్ బల్గేరియా రక్షణ శాఖ ఉప మంత్రి శ్రీమతి కాటెరినా గ్రామటికోవాతోనూ శ్రీ గిరిధర్ సమావేశం అయ్యారు. రక్షణ పారిశ్రామిక ఉత్పత్తుల సహకారానికి సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు.

మారిషన్ ప్రధానమంత్రి కార్యాలయం శాశ్వత కార్యదర్శి శ్రీ కెచన్ బాల్గోబిన్ నేతృత్వంలోని మారిషస్ ప్రతినిధి బృందం శ్రీ గిరిధర్ అరమణేని కలిసింది. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న, భవిష్యత్ రక్షణ సహకార విషయాలపై రెండు వర్గాలు సమీక్షించాయి. ముఖ్యమైన అంశాలపై అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నాయి.

# వైభవంగా శివపార్వతుల కళ్యాణం

నెల్లూరు ఫిబ్రవరి 18:వరికుంట పాడు మండల పరిధిలోని పెద్దిరెడ్డి పల్లి గ్రామంలో వెలసి ఉన్నటువంటి శ్రీ త్రిపురేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చినటు వంటి భక్తులకు ఆలయ అర్చకులు ఆనంద శర్మ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం శివనామ స్మరణలతో మారుమోగింది.

అనంతరం శివపార్వతుల కళ్యాణాన్ని ఆలయ ధర్మకర్తలు పెంద్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు దగ్గరుండి శివపార్వతుల కళ్యాణాన్ని వేదమంత్రాలు భాజా భజంత్రీల నడుమ శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కృప కటాక్షాలను పొందారు. అనంతరం ఆలయం వద్దకు వచ్చినటువంటి భక్తులందరికి మధ్యాహ్నం అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. సూర్యనారాయణ వచ్చిన భక్తులకు దగ్గరుండి భోజనాలను వడ్డించారు.

# కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని సోమనాథుడికి ముడుపు కట్టిన యువకులు



మహబూబాబాద్, ఫిబ్రవరి 18:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ ఎర్రం రెడ్డి తిరుపతిరెడ్డి రావాలని పెద్ద వంగర మండలం నుండి ఎర్రం రెడ్డి యువ సేన అధ్యక్షులు దుంపల హరీష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ యువకులు, యువసేన నాయకులు పాలకుర్తి దేవస్థానంలో సోమనాథుడికి పూజలు నిర్వహించి ముడుపు కట్టారు.

ఈ కార్యక్రమంలో పెద్దవంగర యువజన అధ్యక్షులు హరి కృష్ణ ,తొర్రురు యువజన అధ్యక్షులు తండా రవియాదవ్, పబ్బత్ సంతోష్, మహేష్, వినోద్, సోమిరెడ్డి, దుంపల శోభన్, నవీన్, లక్ష్మన్, దరావత్ నరేష్, భూక్య నవీన్, గద్దల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయమే ఒక పరిశ్రమగా మారాలి: మంత్రి నిరంజన్ రెడ్డి



మెదక్, ఫిబ్రవరి 18: (నేటినిజం ప్రతినిధి ):ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ రంగంలో అన్ని విధాలుగా ముందుకు వెళ్తున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డి పల్లి పారిశ్రామికవాడలో నెలకొల్పిన అక్షయ అగ్రి హార్వెస్టర్ల తయారీ పరిశ్రమను అటవీ శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి మంత్రి నిరంజన్ రెడ్డి శనివారం సందర్శించారు. అక్కడ తయారు చేసిన యంత్రాలను ఆయన పరిశీలించారు.

ఆ తర్వాత మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధిక ఆధునిక విధానాలతో తెలంగాణ వ్యవసాయ రంగం ముందుకు వెళ్తున్నదని చెప్పారు. సీఎం కేసీఆర్ రైతులకు పెద్దపీట వేశారన్నారు. ప్రత్యేకమైన అధునిక పరికరాలతో రైతులకు లాభం చేకూరేలా చర్యలు తీసుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 90 శాతం చిన్న, సన్నకారు రైతులే ఉన్నారన్నారని, 20 ఎకరాలు అంతకుమించి భూమి ఉన్న రైతులు కేవలం 22 వేల మంది మాత్రమేని మంత్రి తెలిపారు.

చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ రంగంలో తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో అత్యధిక దిగుబడి పొందాలంటే వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవసరమని, అందుకోసం మెరుగైన యంత్రాలు కావాలని అన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వ్యవసాయమే ఒక పరిశ్రమగా మారాలని ఆయన అభిప్రాయపడ్డారు. వరికోత, ఇతర పరికరాలను అక్షయ అగ్రి వారు తయారు చేసిన విధానం బాగుందని కితాబిచ్చారు. అనంతరం మంత్రి అగ్రి పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు.

# కేసీఆర్ ప్రధాని కావాలని శివుడికి ప్రత్యేక పూజలు చేసిన మంత్రి ఎర్రబెల్లి



వరంగల్, ఫిబ్రవరి 18: పవిత్ర మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వేయి స్తంభాల గుడిలోని రుద్రేశ్వర స్వామికి, పర్వతగిరిలోని పర్వతాల శివాలయానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

శనివారం వేయి స్తంభాల గుడిని దర్శించుకున్న ఎర్రబెల్లి రుద్రేశ్వరుడికి పాలాభిషేకం చేశారు. అనంతరం పర్వతగిరిలోని పర్వతాల శివాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. పరమ శివుడు రాష్ట్ర ప్రజలను సంతోషంగా చూడాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రిని ఘనంగా సన్మానించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రధాని కావాలని శివుడికి ప్రత్యేక పూజలు చేసినట్లు ఎర్రబెల్లి తెలిపారు. కేసీఆర్ నేతృత్వంలోనే ఆలయాలకు మహర్దశ వచ్చిందని అన్నారు. యాదాద్రి, వేములవాడ, కొండగట్టులను గత పాలకులు పట్టించుకోక సరైన అభివృద్ధి జరగలేదని.. తెలంగాణ వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలకు చాలా నిధులు ఇచ్చి సీఎం కేసీఆర్ దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నారని గుర్తుచేశారు. నాటి కాకతీయుల స్ఫూర్తి తోనే నేడు దేవాలయాలకు కేసీఆర్ పూర్వ వైభవాన్ని తీసుకోస్తు న్నారని పేర్కొన్నారు. వేయి స్తంభాల ఆలయ అభివృద్ధికి కూడా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# శివసేన నేత ఉద్ధవ్ థాకరే కు ఎన్నికల సంఘం షాక్

**-శివసేన పార్టీ పేరును, గుర్తును ఏక్‌నాథ్ షిండే వర్గానికి కేటాయింపు**

**- కేంద్ర ఈసీ సంచలన నిర్ణయం**

ముంబై ఫిబ్రవరి 18 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: శివసేన ఉద్ధవ్ వర్గం నేత ఉద్ధవ్ థాకరే కు ఎన్నికల సంఘం షాకిచ్చింది. శివసేన పార్టీ పేరును, గుర్తును ఏక్‌నాథ్ షిండే) వర్గానికి కేటాయించింది. శివసేన సింబల్ అయిన విల్లు, బాణం గుర్తును షిండేకు కేటాయిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. 2019లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన తరపున గెలిచిన 55 మందిలో 40 మంది షిండే వెంటే ఉన్నారు. మొత్తం ఎమ్మెల్యేలకు కలిపి 47,82,440 ఓట్లు పోలవగా, షిండే వర్గానికి చెందిన 40 మంది ఎమ్మెల్యేలకు 36,57,327 ఓట్లు దక్కాయి. మొత్తం ఓట్లలో 76 శాతం షిండే వర్గానికి దక్కగా ఉద్ధవ్ వర్గానికి చెందిన 15 మంది ఎమ్మెల్యేలకు 12 శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. 2018లో శివసేన పార్టీ రాజ్యాంగంలో సవరణలను తమకు చూపించలేదని, అవి తమకు సమ్మతం కాదని ఎన్నికల సంఘం వ్యాఖ్యానించింది.మరోవైపు ఎన్నికల సంఘం నిర్ణయాన్ని శివసేన తప్పుబట్టింది. వివాదం సుప్రీం కోర్టులో ఉండగానే బీజేపీ ఒత్తిడి కారణంగా షిండే వర్గానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుందని ఎన్నికల సంఘాన్ని విమర్శించింది. అయితే ఎన్నికల సంఘం నిర్ణయంపై శివసేన ఎంపీ సంజయ్ రౌత్ భిన్నంగా స్పందించారు. కొత్త పేరు, కొత్త సింబల్‌తో ప్రజా కోర్టుకు వెళ్తామన్నారు. 2019లో మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో) శివసేన బీజేపీ పొత్తులో సీట్లు పంచుకుని అధికారం చేపట్టేందుకు కావాల్సిన స్థానాలు సంపాదించారు. బీజేపీకి ఎక్కువ స్థానాలు రావడంతో బాల్ థాకరే సమయంలోనే కుదిరిన పాత ఫార్ములా ప్రకారం ఎవరికి ఎక్కువ స్థానాలు వస్తే వారికే ముఖ్యమంత్రి పీఠమనే విషయానికి ఉద్ధవ్ తిలోదకాలిచ్చారు. కాంగ్రెస్, ఎన్సీపీతో కలిసి మహావికాస్ అఘాడి ఏర్పాటు చేసుకుని రెండున్నరేళు మహారాష్ట్ర సీఎంగా కొనసాగారు. అయితే హిందుత్వ సిద్ధాంతాలపై ఉద్ధవ్ రాజీ పడటంతో ఆయన భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. సీఎం పదవి కోల్పోవడంతో పాటు మెజార్టీ శివసేన ఎంపీలు, ఎమ్మెల్యేలు శివసేన ఎమ్మెల్యే షిండే జట్టులో చేరిపోయారు. ఉద్ధవ్ ఒంటరివారైపోయారు.

# తన స్వంత ఖర్చులతో శిక్షణ ఇప్పించిన మహనీయురాలు ఉషా దయాకర్ రావు

**-ఘనంగా ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు జన్మదిన వేడుకలు .**



మహబూబాబాద్, ఫిబ్రవరి 18:(నేటినిజం ప్రతినిధి): పెద్ద వంగర మండల కేంద్రంలోబిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గా ఉషా దయాకర్ రావు జన్మదినని సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య ఆధ్వర్యంలో మండల పార్టీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేసి, మండల ప్రజల తరుపున, బిఆర్ఎస్ శ్రేణుల తరుపున ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు.

వారు మాట్లాడుతూ ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గా పాలకుర్తి నియోజకవర్గంలో నిరుద్యోగ యువతి యువతకు ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ కు దరఖాస్తు చేసుకున్న వారికి ట్రస్ట్ ద్వారా తన స్వంత ఖర్చులతో శిక్షణ ఇప్పించి, ఎంతో మందికి ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలు కల్పించిన ఘనత ఉషమ్మ కే దక్కుతుందని అన్నారు.

కరోనా సమయంలో పేద ప్రజల కోసం కరోనా కిట్స్ (నిత్యావసర సరుకులు, మాస్క్ లు )ఇచ్చి,వైద్యనీ నిమిత్తం అంబులెన్స్ లు ఏర్పాటు చేయించిన మహనీయురాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల నాయకులు బొమ్మెరబోయిన రాజు మండల పార్టీ ఉపాధ్యక్షులు కనుకుంట్ల వెంకన్న,మండల ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షులు ఎదునూరి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షులు బోనగిరి లింగమూర్తి, భూక్యా దాస్రు,గ్రామ రైతు కోఆర్డినేటర్లు బొమ్మిడి కృష్ణ రెడ్డి,మల్లికార్జున చారి, ఈరెంటి శ్రీనివాస్, పిఏసిఎస్ డైరెక్టర్ అనపురం రవి,మండల యూత్ అధ్యక్షులు కాసాని హరీష్,పోచంపల్లి ఉపసర్పంచ్ బానోత్ చంద్రశేఖర్, పాలకేంద్రం చైర్మన్ రాసాల సమ్మయ్య,మండల పార్టీ సంయుక్త కార్యదర్శి మంచినీళ్ల నవీన్, భూక్యా పాండు, మండల సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్రసాని రాంమూర్తి,ప్రధాన కార్యదర్శి దేశెట్టి వెంకటేష్, పెద్దవంగర జెడ్పీఎస్ఎస్ విద్య కమిటీ చైర్మన్ సుంకరి అంజయ్య, నాయకులు చిలుక సంజీవ, గాజుల ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు...

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ సంక్షేమ పథకాలు.. ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ బహ్రెయిన్ అధ్యక్షుడు రాధారపు

హైదరాబాద్: తెలంగాణలో నిరుపేదల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ బహ్రెయిన్ అధ్యక్షుడు రాధారపు సతీశ్ కుమార్ అన్నారు. దేశం మొత్తం తెలంగాణవైపు చూస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బహ్రెయిన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సతీశ్ కుమార్ కట్ చేసి.. ముఖ్యమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో గులాబీ జెండాను లండన్ తరువాత బహ్రెయిన్‌లో ఎగురవేసి కేసీఆర్ వెంట నడిచామని, అదే స్ఫూర్తితో నేడు దేశంలో గుణాత్మక మార్పుకోసం ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ పార్టీ జెండాను సైతం బహ్రెయిన్‌లో కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆవిష్కరించడం గర్వాంగా ఉందన్నారు. బహ్రెయిన్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసులు పార్టీలో చేరి కేసీఆర్ నాయకత్వంలో పని చేయడానికి ఆసక్తిగా ఉన్నారని చెప్పారు.

మంత్రి హరీశ్ రావు ప్రవేశపెట్టిన బడ్జెట్ అటు సంక్షేమం ఇటు అభివృద్ధి రెండు కండ్లుగా ఉన్నదని, విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాలకు భారీగా నిధులు కేటాయించి బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నేడు దేశ ప్రజలు కోరుకుంటున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికి నాయకత్వం వహించాలని ప్రజలంతా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ సెల్ ఉపాధ్యక్షులు వెంకటేష్ బొలిశెట్టి, ప్రధాన కార్యదర్శి పుప్పాల బద్రి, మగ్గిడి రాజేందర్, అన్నారం సుమన్, కార్యదర్శులు చెన్నమనేని రాజేందర్, సంగేపోలు దేవన్న, ఉత్కం కిరణ్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

# సల్లంగా చూడు శివయ్యా...!

**- శైవాలయాల్లో పొంగులేటి ప్రత్యేక పూజలు**



ఖమ్మం, ఫిబ్రవరి 18: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు శైవాలయాలను శనివారం సందర్శించారు.దమ్మపేట శివాలయం, పెనుబల్లి నీలాద్రీశ్వరాలయం,వుల్లయ్య బంజరలోని అప్పయ్య స్వామి గుడి,వైరాలోని స్నానాల లక్ష్మీపురం,ఖమ్మం నగరంలోని గుంటు మల్లన్న,ఖమ్మం రూరల్ తీర్థాల కూడలి జాతర, కూసుమంచి గణపేశ్వర ఆలయాలను సందర్శించారు.ఆయా ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు, రుద్రాభిషేకాల్లో పాల్గొన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని శివయ్యని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పొంగులేటిని ఆలయ మర్యాదలతో సత్కరించారు.

# తీర్థాల శ్రీసంగమేశ్వర ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన కలెక్టర్, సిపి దంపతులు



ఖమ్మం,ఫిబ్రవరి 18: (నేటినిజం ప్రతినిధి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు యస్.వారియర్ లు కుటుంబ సమేతంగా ఖమ్మం రూరల్ మండలం తీర్థాల శ్రీసంగమేశ్వర ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధిగాంచిన శ్రీసంగమేశ్వర ఆలయాన్ని ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా దర్శించుకుంటామని ఈ ఏడు కూడా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు వారు తెలిపారు.

# జపాన్ దీవిలోకి దూసుకెళ్లిన ఉత్తర కొరియా క్షిపణి-- ధ్రువీకరించిన ఉత్తర కొరియా

టోక్యో ఫిబ్రవరి 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఉత్తర కొరియా శనివారం ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్‌ను ప్రయోగించిందని జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది తమ ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఒషిమా దీవికి సమీపంలో హొక్కయిడోకు 200 కిలోమీటర్ల దూరంలో పడినట్లు పేర్కొంది. ఐసీబీఎం క్లాస్ క్షిపణిని ఉత్తర కొరియా ప్రయోగించడం గత నవంబరు తర్వాత ఇదే తొలిసారి.ఉత్తర కొరియా శనివారం ప్రయోగించిన ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్ దాదాపు 900 కిలోమీటర్లు ప్రయాణించినట్లు జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఇది ప్రయాణిం చడా నికి 66 నిమిషాలు పట్టిందని తెలి పింది. ఇది పొరుగు దేశాల విూదుగా ప్రయాణించకూడదనే ఉద్దేశంతో దీనిని నిలువుగా పైకి ప్రయోగించారని తెలిపింది.జపాన్ వెల్లడించిన సమాచారాన్ని దక్షిణ కొరి యా కూడా ధ్రువీకరించింది. జనవరి ఒకటిన లాంగ్ రేంజ్ మిసైల్‌ను ఉత్తర కొరియా ప్రయో గించిందని, ఆ తర్వాత అటువంటి మిసైల్‌ను ప్రయో గించడం ఇదే మొదటిసారి అని తెలిపింది. ప్యాంగ్యాంగ్ (ఉత్తర కొరియా రాజధాని)లోని సునన్ ప్రాంతం నుంచి దీనిని ప్రయోగిం చిం దని తెలిపింది.ఉత్తర కొరియా అణ్వా యుధాలను ప్రయోగించే సామర్థ్యాన్ని కలిగియుందనే ఊహా గానాల నేపథ్యంలో అమెరికా దక్షిణ కొరియా వచ్చే వారం వాషింగ్టన్‌లో మిలిటరీ డ్రిల్స్ నిర్వహించబోతున్నాయి. అయితే ఈ రెండు దేశాలు కలిసి తమపై దాడి చేయ డానికి రిహార్సల్ చేస్తున్నాయని ఉత్తర కొరియా అభిప్రాయపడుతోంది. మునుపెన్నడూ లేని స్థాయిలో గట్టి సమాధానం చెబుతామనీ శుక్రవారం శపథం చేసింది.జపాన్ రక్షణ మంత్రి తొషిరో ఈనో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, తమ దేశ ప్రజల జీవితాలు, ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# హెలికాప్టర్ సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే రమేష్ బాబు



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 18: (నేటినిజం ప్రతినిధి): : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరిం చుకుని ఆలయ ప్రాంగణంలో పర్యాటక శాఖ వారు నిర్వహిస్తున్న హెలికాప్టర్ సేవలను ప్రారంభించిన శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు ఆయన సతీమణితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ న్యాలకొండ అరుణ- మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్, ఆర్డిఓ శ్రీనివాసరావు, ఎంఆర్ఓ రాజా రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

